బదిలీల జాతర

జడ్పీలో వివిధ కేడర్లకు సంబంధించి 429 మంది

పది మంది ఎంపీడీవోలు ఇతర జిల్లాలకు..

జడ్పీ డిప్యూటీ సీఈవో, డీపీవో బదిలీ -7లో

పంచాయతీ కార్యదర్శుల బదిలీలు పూర్తి



నినాదాలు చేస్తున్న వైద్యాధికారులు

99 మంది వైద్యాధికారులకు.. షోకాజ్ నోటీసులు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 22 : అనధికారికంగా విధులకు గైర్హాజరవుతున్నారన్న కారణంపై జిల్లాలో మొత్తం 99 మంది వైద్యాధికారులకు షోకాజ్ నోటీసులను డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ ఆదివారం జారీ చేశారు. షోకాజ్ నోటీసులు ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసేందుకే దారి తీస్తాయని నిరవధిక సమ్మె చేస్తున్న పీహెచ్‌సీల వైద్యా ధికారులు స్పష్టం చేశారు. ఈ పరిణామాలతో పీజీ వైద్యవిద్య ప్రవేశాల్లో గ్రామీణప్రాంత ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్యాధికారులకు ఇన్‌సర్వీస్ కోటా కింద 30శాతం రిజర్వేషన్లను కొనసాగించాలంటూ కొద్దిరోజులుగా జరుగుతున్న ఆందోళన ఒక కొలిక్కి వచ్చేలా లేదు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నెల 17 నుంచి పీహెచ్‌సీ విధులకు గైర్హాజరవుతున్న జిల్లాలోని 99 మంది వైద్యా ధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసిన డీఎంహెచ్‌వో సంబంధిత నోటీసులు అందుకున్న వైద్యులందరూ మూడురోజుల్లోగా సంజాయిషీ ఇవ్వా ని, లేనిపక్షంలో సీసీఏ నిబంధనల ప్రకారం క్రమశిక్షణా చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. దీంతోపాటే జారీ చేసిన మరో ఉత్తర్వులో విధులకు గైర్హాజరవుతున్న వైద్యాధికా రులందరికీ ముఖ ఆధారిత హాజరు (ఎఫ్ ఆర్ఎస్)ని ప్రామాణికంగా తీసుకుని గైర్హాజరుకాలానికి జీతభత్యాల్లో కోత విధించాలని ఆయా పీహెచ్‌సీల డీడీవోలను ఆదేశించారు. .

నేడు 'చలో విజయవాడ'

నేడు వైద్యాధికారుల 'చలో విజయవాడ'

ఇన్‌సర్వీస్ కోటాపై ప్రభుత్వం ఏ హామీని లేదా సంబంధిత జీవో 85 ఉత్తర్వుల రద్దుగాని చేయనందున ఆందోళనను మరింత ఉధృతం చేయడానికే నిర్ణయించామని ఏపీ పీహెచ్‌సీల వైద్యుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ పూర్ణచంద్రకుమార్ వెల్లడించారు. ఇందులో భాగంగా ఆదివారం డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఫైర్‌స్టేషన్ సెంటర్ వరకు బైక్‌లు, కార్లతో ర్యాలీ నిర్వహించారు. తదుపరి సోమవారం వైద్యాధికారులందరూ 'చలో విజయవాడ' ఆందోళనకు తరలి వెళ్తామని, అక్కడ ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించేందుకు పోలీసుల అనుమతి లభించిందన్నారు. ప్రభుత్వ స్పందనను బట్టి తదుపరి కార్యాచరణకు అక్కడే నిర్ణయం తీసుకుంటామన్నారు. సంఘ నాయకులు పూర్ణిమ, జ్ఞానేష్, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ ప్రదర్శనలో కనకాద్రిపురం చిరుధాన్యాల ఉత్పత్తులు

కొయ్యలగూడెం, సెప్టెంబరు 22 : ప్రపంచ దేశాలన్నీ కలిసి నిర్వహిస్తున్న ప్రపంచ ఆహార కార్యక్రమంలో కొయ్యలగూడెం మండలానికి చోటుదక్కింది. ఢిల్లీలో ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు నిర్వహిస్తున్న వరల్డ్‌ఫుడ్ ఇండియా పేరుతో నిర్వహిస్తున్న ప్రదర్శనలో కొయ్యలగూడెం మండలం కనకాద్రిపురం గ్రామానికి చెందిన మదర్‌థెరిస్సా మహిళా స్వయం సహాయక సంఘం చిరుధాన్యాల ఉత్పత్తులను ఆ ప్రదర్శనలో పెట్టారు. ఆ ప్రదర్శనను ఆదివారం రాష్ట్ర పరిశ్రమలు, ఆహార ప్రాసెసింగ్ మంత్రి టి.భరత్ సందర్శించి అభినందించి నట్టు మహిళా స్వయం సహాయ సంఘ అధ్యక్షురాలు టి.కృపామణి తెలిపారు. తొలిరోజు కేంద్ర ఆహార శుద్ధి శాఖ మంత్రి పాస్వాన్ ప్రారంభించారని, రెండవరోజు ఏపీ రాష్ట్ర మంత్రి భరత్ స్టాల్స్‌ను తిలకించారని తెలిపారు. తాము చేస్తున్న ఉత్పత్తులకు ఢిల్లీలో జరుగుతున్న ప్రదర్శనకు ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉందని ఈ సందర్భంగా తెలిపారు.


ఢిల్లీ ప్రదర్శనలో కనకాద్రిపురం చిరుధాన్యాల ఉత్పత్తులను పరిశీలిస్తున్న రాష్ట్ర మంత్రి భరత్

వీళ్లు గల్లంతు


సౌమ్య


అమృత


హరదీప్


చికిత్సపొందుతున్న హరిణి


కన్నీటవాగు : ఒక్కసారి ఉధృతంగా మారి ఐదుగురిని ముంచేసిన జలతరంగిణి వాగు ఇదే..

విషాదయాత్ర

ఎప్పుడూ చదువేనా.. కాస్త మార్పు కావాలనిపించింది.. పచ్చని ప్రకృతి ఒడిలో రోజంతా సేదతీరితే.. మళ్లీ రీఫ్రెష్ అవుతామని అనుకున్నారు.. అనుకున్నదే తడవుగా ఏలూరు ఆశ్రంలో మెడికల్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న 14 మంది తూర్పు ఏజెన్సీలోని అటవీ ప్రాంతానికి వచ్చారు.. మారేడుమిల్లి జలతరంగిణి జలపాతం వద్ద ఆగారు. అప్పటి వరకూ ఎంతో ఉత్సాహంగా గడిపారు. తమ స్నేహానికి జీవితంలో గుర్తుండేలా ప్రకృతి అందాలతో కలిసి ఫొటోలను దిగారు. అకస్మాత్తుగా ప్రకృతి కన్నెర్ర చేసింది. వర్షపు నీరు వరదలా మారి క్షణాల్లోనే జలపాతంలోకి రావడం గమనించలేకపోయారు. ఒక్కసారిగా వరద పెరిగి 14మందికి ఐదుగురు కొట్టుకుపోయారు. వీరిలో ఇద్దరిని మిగతా స్నేహితులు, అగ్నిమాపక సిబ్బంది కలిసి అతికష్టం మీద కాపాడారు. మరో ముగ్గురు గల్లంతయ్యారు. దీంతో వీరి విహార యాత్ర.. విషాదంగా మారింది. ఈ వ్యవహారంలో అటవీశాఖ నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఇటీవల వర్షాల నేపథ్యంలో పర్యాటక ప్రాంతాలకు అనుమతులు రద్దు చేశారు. అయినా జలతరంగిణి వద్ద అటవీశాఖ సిబ్బంది వీరిని అనుమతించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

చూస్తుండగానే ముంచేసిన జలతరంగిణి వాగు

- ఆశ్రం విద్యార్థుల విహారయాత్ర
- కళ్లెదుటే ఐదుగురు గల్లంతు
- క్షణాల్లోనే ఆవిరైన ఆనందం
- ఇద్దరిని కాపాడిన వైనం
- కానరాని ముగ్గురి ఆచూకీ
- చీకటిపడడంతో ఆగిన గాలింపు
- అందరూ మెడికల్ విద్యార్థులే
- మారేడుమిల్లి వద్ద ఘటన
- రెండు రోజులుగా అనుమతుల్లేవ్

మారేడుమిల్లి/ఏలూరు క్రైం, సెప్టెంబరు 22 : వైద్య విద్యార్థుల విహారయాత్ర విషాదంగా మిగిలింది.అప్పటి వరకూ ఎంతో ఆనందం గడిపిన వారంత ఒక్కసారిగా హతాశులయ్యారు. అప్పటి ఎంతో ప్రశాంతంగా ఉన్న వాగు క్షణాల్లోనే ఉధృతంగా మారి తమ కళ్లెదుటే స్నేహితులను ముంచేయడంతో కన్నీటి పర్యంతమయ్యారు.ఏలూరు ఆశ్రం వైద్యకళాశాలలో ద్వితీయ సంవత్సరం మెడికల్ విద్యార్థులు 14 మంది విద్యార్థులు టెంపో ట్రావెల్ బస్‌లో శనివారం రాత్రి విహారయాత్రకు బయలుదేరారు. ఉదయం నుంచి పలు ప్రాంతాలు చూసుకుంటూ మధ్యాహ్నానికి అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మారేడుమిల్లికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న జల తరంగిణి జలపాతం వద్దకు చేరుకున్నారు. అక్కడే భోజనాలు చేసి మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ప్రశాంతంగా కనిపించిన జలపాతంలోకి కొంత మంది స్నానాలకు దిగారు. కొంతమంది ఫొటోలు తీసుకుంటున్నారు. అప్పటికే వర్షం ప్రారంభమైంది. ఎగువ ప్రాంతాల్లో కూడా వర్షం పడుతోంది. వాగులో ఎర్రరంగు నీరు వస్తున్నా స్నానం చేసేవారికి అర్థం కాలేదు. ఫొటోలు తీసేవారు బురద నీరు వస్తోందని కేకలు వేస్తున్నారు. అయినా జలపాతం శబ్దంలో స్నానాలు చేసే వారు గమనించలేకపోయారు. క్షణాల్లోనే నీరు పెరిగిపోతుండగా వెంటనే కొంతమంది తప్పించుకోగా ఐదుగురు చిక్కుకుపోయారు. వాగు ఉధృతికి ఐదుగురు విద్యార్థులు గాయత్రి పుష్ప, చింతా హరిణి ప్రియ, కె.సౌమ్య, బి.అమృత, సీహెచ్ హరదీప్ కొట్టుకుపోయారు. వీరిలో ఒకరిని స్నేహితులు అతికష్టం మీద కాపాడగలిగారు.ఈలోపు పోలీసులకు సమాచారం అందింది. వారు వెంటనే రంపచోడవరం అగ్నిమాపక సిబ్బందిని రప్పించారు. కొండలపై నుంచి వర్షపునీరు ఉధృతంగా రావడంతో మిగిలినవారి జాడ తెలియలేదు.కాసేపటికి జలపాతం దిగువన కల్వర్టు వద్ద సిమెంట్ తూరల్లో ఒకరు ఉన్నట్టు గుర్తించి అగ్నిమాపక సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ చేపట్టి కాపాడారు. గాయత్రి ప్రియ, చింతా హర్షిణిలను రక్షించారు. మిగిలిన ముగ్గురు విద్యార్థులు ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన చింతకుంట హరదీప్ (20), విజయనగరం జిల్లాకు చెందిన కొసిరెడ్డి సౌమ్య(21), బాలిఅమృత (22) గల్లంతయ్యారు. వీరిని 108 అంబులెన్స్‌లో రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఒకరిని మెరుగైన వైద్యంకోసం రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పినట్టు సమాచారం. గల్లంతైన వారికోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయగా .చీకటి పడిపోవడం.. వర్షం పడుతుండడంతో ఆటంకంగా మారాయి. రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలను పర్యవేక్షించారు. మారేడుమిల్లి సీఐ సీహెచ్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఎస్ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వైద్యవిద్యార్థుల కోసం తమ కళాశాల తరఫున ప్రత్యేక బృందాన్ని పంపించామని,వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఏలూరు ఆశ్రం కళాశాల యాజమాన్యం వెల్లడించింది.

ఆశ్రంలో తీవ్ర విషాదం..

గల్లంతైన వారు ఎక్కడైనా చెట్లను పట్టుకుని బతికి ఉన్నారేమో అనే ఆశతో తోటి విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. గల్లంతైనవారిలో చింతపల్లి హరదీప్‌కు బ్యాడ్మింటన్ క్రీడాకారుడిగా పేరుంది.కార్డియాలజీలో ప్రత్యేక వైద్యనిపుణుడిగా పేరు పొందాలనే ఆశయం చదువుతున్నాడు. బాలి అమృత తెలివైన విద్యార్థిని.. డాక్టర్ చదివి పేదల వైద్యురాలిగా పేరు పొందాలనే ఆశయం తోనే ఉంది. కొసిరెడ్డి సౌమ్య మంచి వైద్యురాలిగా ప్రజలకు సేవ చేయాలనే ఆశయంతోనే చదువును కొనసాగిస్తోంది.ముగ్గురు విద్యార్థులు జలపాతం వద్ద కొట్టుకుపోయారని సమాచారం అందడంతో ఆశ్రం కళాశాలలో విద్యార్థుల్లో తీరని విషాదం నెలకొంది. ఘటనపై రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్ తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గల్లంతైన విద్యార్థుల కోసం గాలింపు చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్టు మంత్రి చెప్పారు.

యాత్రకు వెళ్లింది వీరే..

మొత్తం 14మంది విద్యార్థుల వివరాలు ఇలా ఉన్నాయి. **గల్లంతైన విద్యార్థులు :** కొసిరెడ్డి సౌమ్య(21), బాలి అమృత (22)(విజయనగరం జిల్లా), చింతకుంట హరదీప్(20)(ప్రకాశం జిల్లా మార్కాపురం), **గాయపడినవారు :** దండే గాయత్రి పుష్ప(బాపట్ల), సీహెచ్ హరిణి ప్రియ (విశాఖ జిల్లా మధురవాడ), పొట్లూరి ప్రగ్న (భీమిలి),**మిగిలినవారు :** హిమబిందు(బొబ్బిలి), మేఘన(కర్నూలు), స్వప్న(అనంతపురం), హరినేత్ర(చీరాల), అవినాష్, హరిప్రియ, ధీరజ (రాజమండ్రి),జాగృతి(ద్వారకాతిరుమల)

పనులకు పదును!

ఐదేళ్ల పాటు జగన్ ప్రభుత్వంలో ఎక్కడి పనులు అక్కడే. ఆఖరుకి వాహనదారులకు లైసెన్సు కార్డులు ఇచ్చే దగ్గర నుంచి పేదలకు ఆరోగ్యశ్రీ కార్డులు పంచేవరకు ఒకటే సతాయింపు. అన్నింటికి ఆర్భాటం.. చివరికి చేతులెత్తేసిన వైనం. అన్నిటికంటే మించి బలహీనపడిన ఏటిగట్లను గాలికొదిలేశారు. చెరువులు, కుంటలను నిర్లక్ష్యం చేశారు. సాగునీటి సంఘాలకు ఎన్నికలలేవు. చేనేత సొసైటీలకు దిక్కుమొక్కులేదు. అన్నిటికంటే భారీ ప్రకటనల రూపంలో అవినీతి. దీనికి చెక్ పెడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజులు దరిమిలా అన్ని పనులకు పదును పెడుతోంది. అధికార యంత్రాంగం, మం త్రులు, ఎమ్మెల్యేలు వీటిలో భాగస్వాములు అవుతున్నారు.

ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

- జల వనరుల పనులకు ప్రాధాన్యత
- తాజాగా పడిన గండ్లు పూడ్చివేతకు శ్రీకారం
- చొరవ చూపి నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- గుంతలు తేలిన మార్గాలకు త్వరలో మోక్షం
- నీటి సంఘం, చేనేత సంఘాల ఎన్నికలకు రంగం సిద్ధం
- పనిలో పనిగా ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు
- అన్ని పనులు సమాంతరంగా అమలుకే కూటమి నిర్ణయం

జల వనరులపై ప్రత్యేక దృష్టి

ఇప్పుడంతా వ్యవసాయ సీజన్. రైతుకు సాగునీరు అందించాల్సిన ఆవశ్యకత సర్కారు మీద ఉంది. ఈ దిశగానే ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలు, ఆఖరుకి ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (స్పందన) కార్యక్రమంలోను రైతులు సాగునీటి వనరులను పరిరక్షించాల్సిందిగా అనేకమార్లు విజ్ఞప్తి చేశారు. దీంతో ప్రభుత్వం ఈ పనులన్నింటినీ ప్రాధాన్యతా క్రమంలో చేర్చింది. జల వనరుల పనులన్నింటినీ వేగిరపర్చాల్సిందిగా ఇప్పటికే ఆ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కలెక్టర్‌ను కోరారు. ఈ మధ్య కాలంలో వరుసగా వరదలు రావడం, చెరువులు, కుంటలు, కాల్వలకు గండ్లు పడ్డాయి. వీటి కారణంగా భారీ నష్టమేచేకూరింది. నూజివీడులో పెద్ద చెరువుకు పడిన గండిని ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే మంత్రి కొలుసు పార్థసారథి తాజాగా పూడ్చివేత పనులకు శంకుస్థాపన చేశారు. భవిష్యత్తులో భారీ వర్షాలు కురిస్తే పెను ప్రమాదంకు ఆస్కారం లేకుండా అంతకంటే మించి నీటి నిల్వకు వీలుగా కేవలం మూడు వారాల వ్యవధిలోనే స్పందించడం ఓ రికార్డు. అదే జగన్ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ఎక్కడైనా గండ్లు పడితే వాటిని పూడ్చేందుకు నెలలు తరబడి సమయం తీసుకునేవారు. ఇప్పుడు ఆ నిర్లక్ష్యాన్ని చెరిపివేస్తూ నూజివీడు పెద్ద చెరువుతోపాటు మిగతా చోట్ల పడిన గండ్లకు తక్షణ మరమ్మతు పనులు ఆరంభమయ్యాయి. ఈ ప్రాధా న్యతను గమనించి రైతులు సంతోషపడుతున్నారు. పెదపాడు మండలంలో కాల్వకు పడిన గండిని పూడ్చి వేశారు. మిగతా చోట్ల అక్కడక్కడ గట్లు బలహీన పరిస్థితులను గమనించి వాటిని పటిష్టం చేయడానికి కార్యాచరణ ఆరంభమైంది.



నీటి సంఘాలకు త్వరలోనే ఎన్నికలు

సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరిగి ఏళ్లు గడుస్తున్నాయి. ఈ మధ్యనే సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, రైతులకు నిత్యం ఆమోదయోగ్యమైన నీటి సరఫరా వ్యవహారాన్ని పర్యవేక్షించడంలో ప్రధాన భూమిక వహించే సాగునీటి సంఘాలకు జీవం పోయాలని కూటమి ప్రభుత్వం 40 రోజుల క్రితం నిర్ణయిం చింది. వీలైనంత మేర వీటి ఎన్నికల నిర్వహణకుగాను చర్యలకు ఆదేశించిన తరుణంలోనే వరుసగా భారీ వర్షాలు వచ్చిపడ్డాయి. యంత్రాంగం యావత్తు సహాయ చర్యల్లో నిమగ్నమైంది. ఇలాంటి తరుణంలో ఎన్నికలకు వీల్లేదు కాబట్టి దానికనుగుణంగానే సాగునీటి ఎన్నికల తేదీలను త్వరలో ప్రకటిస్తామని ప్రభుత్వం రైతులకు భరోసా ఇచ్చింది. ఈ మధ్యకాలంలో బుడమేరు నుంచి కొల్లేరు, గోదావరి వరదలు వరుసగా ఆందోళనకు గురిచేసిన నేపథ్యం నుంచి ఇప్పుడిప్పుడే ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో ఆయా సంఘాలకు ఎన్నికల తేదీలను కొద్ది రోజుల వ్యవధిలోనే ప్రకటించబోతున్నారని భావిస్తున్నారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదిక, లేకుంటే విభజిత జిల్లానా అనేది నిర్దేశించి మరీ ఎన్నికలు నిర్వహిస్తారు. దీనిపై ఇప్పటికే తుది కసరత్తుకు జల వనరుల శాఖ దిగింది. సాగునీటి సంఘాలకు జీవం పోసే దిశగా కూటమి ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకోవడంతోపాటు కాల్వల పనులకు సాధ్యమైనంత మేర నిధులు కేటాయించేందుకు సిద్ధమైంది.

రోడ్లకు మోక్షం



జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే రాకపోకలకు అత్యంత దుర్లభంగా ఉన్న మార్గాల్లో తక్షణ మరమ్మతులకు వీలుగా ప్రభుత్వం అధికారులకు దిశ, నిర్దేశం చేసింది. ఇంతకుముందే ఐదేళ్లపాటు ఉమ్మడి పశ్చిమలో రోడ్లన్నీ నరకాన్ని తలపించాయి. ఆఖరుకి ద్విచక్ర వాహనాలు కూడా తిరగలేనంత దుర్భర పరిస్థితులు తలెత్తాయి. అప్పటి జగన్ సర్కార్ ఈ పనులన్నింటినీ చూస్తూ గాలికొదిలేసింది. ఆఖరుకి దెబ్బతిన్న జాతీయ రహదారులకు మరమ్మతులు చేసే వీలుగా కేంద్రాన్ని అభ్యర్థించలేకపోయింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆయా శాఖలపై సమీక్షల ద్వారా పట్టు బిగుస్తున్నారు. ఏఏ శాఖలకు ప్రాధాన్యత క్రమంలో నిధులు కేటాయించవచ్చో గుర్తించి ఆ మేరకు చర్యలకు దిగుతున్నారు. ఇదే పరిణామ క్రమంలో జిల్లాల వారీగా దెబ్బతిన్న రోడ్లన్నింటికి మరమ్మతులకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం నుంచి వచ్చిన ప్రతిపాదనలలో కొన్నింటికి ఆమోదముద్ర వేశారు. కార్యాచరణ రూపొందించుకుని మరమ్మతులు చకచకా సాగేలా ఆదేశాలు వెలువడ్డాయి.

చేనేత ఎన్నికలకు చర్యలు ..



ఒకవైపు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చకచకా కానిస్తూనే ఇంకోవైపు స్థానికంగా జరిగే వివిధ సంఘాల ఎన్నికల విషయంలోనూ కూటమి ప్రభుత్వం చకచకా నిర్ణయాలు తీసుకుంటోంది. చేనేత సహకార సంఘాలకు త్వరలోనే ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆ మేరకు ఆయా సంఘాల్లో ఉన్న స్థితిగతులను అంచనా వేసి ఏఏ చర్యలకు ఆస్కారం ఉందో ఇప్పటికే నివేదిక రాబట్టింది. దీంతోపాటు చేనేత సంఘాల్లో సభ్యత్వాలను ఒక కొలిక్కి తెచ్చి ఎన్నికల నిర్వహణకు వీలుగా ఏర్పాట్లకు దిగుతున్నారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలకు ప్రక్రియ ఆరంభమైంది. నవంబరులో ఎమ్మెల్సీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ ఎన్నికల్లో కూటమి పాత్ర ఎలా ఉండబోతుందో త్వరలోనే స్పష్టత ఇవ్వబోతున్నారు. నియోజకవర్గాల వారీగా తాజా పరిస్థితిని మదింపు చేసిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోనున్నారు. అంటే ఒకవైపు ప్రజా పనులు, ఇంకోవైపు ఎన్నికలు.. దేని నిర్వహణ దానిదేఅన్నట్టుగా కూటమి ప్రభుత్వం చొరవతో చకచకా అడుగులు వేస్తోంది.

దోషులను శిక్షించాల్సిందే..

- తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీపై కొనసాగుతున్న నిరసనలు

బుట్టాయగూడెం, సెప్టెంబరు 22 : గత వైసీపీ ప్రభుత్వం హయాంలో జరిగిన తిరుమల లడ్డూ కల్తీ అంశం భక్తులలో తీవ్ర వ్యథను మిగిల్చింది. ఆలయ పవిత్రతను దెబ్బతీసిన బాధ్యులను కఠినంగా శిక్షించాలని జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల హిందూ సంఘాలు, ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల వారు డిమాండ్ చేశారు. తిరుమలను అపవిత్రం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఆదివారం హిందువులు బుట్టాయగూడెంలో కూటమి ఆధ్వర్యంలో అపచారం జరిగింది క్షమించు స్వామి అంటూ హిందూవులు పశ్చాత్తాప పాదయాత్రను నిర్వహించారు. దోషులను శిక్షించాలని నినాదాలు చేశారు. తిరుమల పవిత్రతను కాపాడటమే కాకుండా ఆర్టికల్ 26ను అమలు చేస్తూ హిందూ దేవాలయాలను ప్రభుత్వాల కబంధహస్తాల నుంచి విముక్తి చేయాలని కోరారు. హిందూ దేవాలయాల నుంచి వచ్చిన ఆదాయాన్ని హిందూవులకు మాత్రమే ఖర్చు చేయాలని, అప్పుడే హిందూ ధర్మం పవిత్రత కాపాడబడుతుందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందూవుల మనోభావాలను దెబ్బతీస్తున్న నాస్తికవాద అధికారులను దేవాలయాల బోర్డుల్లో నియమించకూడదన్నారు. కూటమి నేతలు నల్లూరి కృష్ణమోహన్, కొండేపాటి రామకృష్ణ, వంకా కాంచనమాల, శివాజీ చక్రవర్తి, సోంబాబు, గంగాభవానీ, శ్రీహరి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



బుట్టాయగూడెంలో పశ్చాత్తాప పాదయాత్ర చేస్తున్న హిందువులు

భక్తుల మనోభావాలు దెబ్బతీశారు

భీమడోలు : తిరుమల తిరుపతి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరగడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు శ్రీ గాయిత్రీ జిల్లా బ్రాహ్మణ సేవాసమితి ఒక ప్రకటనలో తెలిపింది. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు లడ్డూ ప్రసాదాన్ని దైవ ప్రసాదంగా భావిస్తారని అటువంటి తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడినట్లు సాక్ష్యాలతో తిరుమల తిరుపతి దేవస్థానం బహిర్గతం చేయడం హిందూ భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. ఇటువంటి అక్రమాలు పునరావృతం కాకుండా చూడాలని తిరుమల దేవస్థానం, రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. దేవస్థానం తరఫున ఆంధ్రప్రదేశ్ పాడి రైతులకు సహకారం అందించి గోవుల సంరక్షణ, ఆవు పాలకు గిట్టుబాటు ధర కల్పించి ఏపీ డెయిరీ విజయా సంస్థ ద్వారా స్వచ్ఛమైన ఆవునెయ్యి, ఆవు పాలు తిరుమల తిరుపతి దేవస్థానాలు సేకరించాలన్నారు. గో సంరక్షణ ద్వారా ఎటువంటి అక్రమాలకు తావు లేకుండా ఉంటుందని బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు తోలేటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కాశీభొట్ల పార్వతీశ్వరశర్మ, కోశాధికారి అమ్మనమంచి మురళీకృష్ణ పేర్కొన్నారు.


కలిదిండిలో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

బీజేపీ నాయకుల నిరసన

కలిదిండి : తిరుపతి లడ్డూ అపవిత్రతపై ఆదివారం కలిదిండిలో బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. తిరుపతి లడ్డూను అపవిత్రం చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. సనాతన ధర్మాన్ని, హిందూ ధార్మిక విశ్వాసాలను దెబ్బతీసేలా కుట్ర చేసిన వారిని శిక్షించి భక్తుల మనోభావాలను పరిరక్షించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు నంబూరి బాందు రాజు, నాయకులు చిట్టూరి రవీంద్ర, కోకా శ్రీనివాస్, చక్కా జగన్, జడ్డు సత్యనారాయణ, కోకా రమేష్, పంచకర్ల శివాజీ, తలారి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులకు శిక్ష తప్పదు : ఎమ్మెల్యే కామినేని

కైకలూరు : తిరుమల ప్రసాదంలో జంతు అవశేషాలతో తయారుచేసిన నెయ్యిను వాడి తిరుమల ప్రతిష్ఠకు మచ్చ తెచ్చారని వారిని ప్రభుత్వం తప్పనిసరిగా శిక్షిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలం ఆచవరం, వేమవరప్పాడు గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోనే తిరుమల తిరుపతి దేవస్థానానికి ఎంతో ప్రాముఖ్యతన ఉందని భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వైసీపీ ప్రభుత్వం నడిచిందన్నారు. మార్కెట్ల ధరలు కాదని కమీషన్లకు కక్కుర్తిపడి తక్కువ ధరకు నెయ్యిని కొనుగోలు చేశారని విమర్శించారు.

రోడ్డు కోసం కలిసికట్టుగా..

- రూ.28 లక్షలు సేకరించిన కొల్లేరు లంక వాసులు -7లో



గుబ్బల మంగమ్మతల్లి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గుబ్బల మంగమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం, సెప్టెంబరు 22 : మన్యం బిడ్డల ఆరాధ్య దైవం గుబ్బల మంగమ్మతల్లి అమ్మవారిని దర్శించుకోడానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారు జామునుంచే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు.వర్షాలు కురవకపోవడంతో వాతావరణం పొడిగా ఉండటంతో భక్తులు తరలివచ్చారు. దర్శనానికి తరలివచ్చిన భక్తులతో అమ్మవారి ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. వాతావరణశాఖ హెచ్చరికలతో సాయంత్రం 3 గంటల కల్లా పనులు ముగించుకుని వెళ్లాలని ఆలయ కమిటీవారు చెప్పడంతో భక్తులు త్వరగా మొక్కుబడులు తీర్చుకుని స్వగ్రామాలకు తిరుగు ప్రయాణమయ్యారు.





స్టాంపులు, నాణేల ప్రదర్శన ప్రారంభిస్తున్న డాక్టర్ బాబ్జీ..ప్రదర్శనలో ఆకర్షణీయంగా ఉన్న కిలో వెండి నాణెం

సంస్కృతికి చిహ్నాలు నాణేలు.. స్టాంపులు

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు, 22 : జాతీయతకు, సంస్కృతికి ఆయా కాలాలను గుర్తు తెచ్చేవి నాణేలు, స్టాంపులు అని లయన్స్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ మూర్తి (బాబ్జీ) అన్నారు. లయన్స్ క్లబ్‌హాల్లో యూత్ హాస్టల్స్, లయన్స్ క్లబ్ ఆదివారం ఏర్పాటు చేసిన స్టాంపులు, నాణెముల ప్రదర్శనను బాబ్జీ ప్రారంభించారు. రెండురోజులు ఈ ప్రదర్శన ఉంటుందని నిర్వాహకుడు, యూత్ హాస్టల్స్ పాలకొల్లు శాఖ చైర్మన్ కారుమూరి సూర్యనారాయణ తెలిపారు. ఈ ప్రదర్శనలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 10 మంది స్టాంపులు, నాణెములు, వివిధ దేశాల కరెన్సీ నోట్లు ప్రదర్శించారు. పాలకొల్లు శాఖ అధ్యక్షుడు పెద్దిబోట్ల లక్ష్మీనారాయణ, డాక్టర్ బీహెచ్ అచ్యుత రామరాజు, శ్రీఖాకొల్లు కామేశ్వరరావు, సత్యనారాయణ మూర్తి, లయన్స్ ప్రెసిడెంట్ డాక్టర్ జయభారత రెడ్డి, కెజి భీమేశ్వరరావు, కొట్టు బాస్కరరావు పాల్గొన్నారు.



38 సంవత్సరాల తర్వాత కలసిన విద్యార్థులు

పెంటపాడు పోస్ట్ బేసిక్ పాఠశాలలో అపూర్వ సమ్మేళనం

పెంటపాడు, సెప్టెంబరు 22: మండల కేంద్రమైన పెంటపాడు ప్రభుత్వ పోస్టు బేసిక్ పాఠశాలలో 1986-87 సంవత్సరంలో విద్యనభ్యసించిన 10వ తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల ప్రాంగణంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 38 సంవత్సరాల తరువాత కలసిన వీరంతా కుటుంబాలతో హాజరై తాము చదువుకున్నప్పటి సంగతులను గుర్తుకు తెచ్చుకుంటూ ఆనందంగా గడిపారు. తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయులు కృష్ణశాస్త్రి, రామారావులను ఘనంగా సత్కరించారు. ఏర్పాట్లను పూర్వవిద్యార్థులు కోదండరావు, రాజశేఖర్, మురళీ మోహన్‌రెడ్డి, శ్యాంప్రకాష్, ఉషాలక్ష్మి, వసంతలు పర్యవేక్షించారు.

రాష్ట్ర స్థాయి రిసోర్స్ పర్సన్‌గా స్వామి మాస్టారు



కాళ్ళ, సెప్టెంబరు 22 : ఈ- కంటెంట్ రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్‌గా సీసలి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బొబ్బిలి రాజమౌళి కోటేశ్వర స్వామి ఎంపికయ్యారని ఎంఈవో రవీంద్ర ఆదివారం తెలిపారు. సీఐఈటీ - ఎన్‌సీ ఈఆర్‌టీ న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో ఈ-కంటెంట్ అభివృద్ధి కోసం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి ఉపాధ్యాయులను స్టేట్ రిసోర్స్ గ్రూప్ మెంబర్స్ (ఎస్ఆర్‌జి)గా ఎంపిక చేసి వారికి రెండు బ్యాచ్లలో ఆన్‌లైన్ శిక్షణ ఇస్తున్నార న్నారు. దీనిలో భాగంగా రెండవ ఫేజ్‌లో 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఆన్‌లైన్ శిక్షణలో ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపిక చేసిన 20 మందిలో ఈయన ఉన్నారు. ఈ కంటెంట్‌లో భాగంగా 3వ తరగతి గణితమునకు సంబంధించి రూపొందించిన వీడియోలు ఏపీ ఈ పాఠశాల ఆప్, ప్రభుత్వ యూట్యూబ్ ఛానల్‌లో పొందుపరిచినట్టు స్వామి మాస్టారు తెలిపారు. ఎంఈవో-2 వెంకటేశ్వర రావుతో పాటు పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.



కొల్లేటికోట రోడ్డులో కోతకు గురైన ప్రదేశాల్లో గ్రామస్తుల మట్టి తోలకం

రోడ్డు కోసం కలిసికట్టుగా..

» రూ.28 లక్షలు సేకరించిన కొల్లేరు లంక వాసులు

కైకలూరు, సెప్టెంబరు 22: ఇటీవల కొల్లేరు వరద ఉధృతితో లంక గ్రామాల్లో రోడ్లు ధ్వంసమయ్యాయి. ఈ రోడ్ల మరమ్మతులకు లంక గ్రామాల ప్రజలు ఏకతాటిపైకి వచ్చి విరాళాలను సేకరించారు. కైకలూరు మండలంలోని పెంచికలమర్రు, గుమ్మళ్ళపాడు, శృంగవరప్పాడు గ్రామాల్లో సుమారు 8వేల మంది ఓటర్లు నివశిస్తున్నారు. ఒక్కొక్క ఓటరు 300 చొప్పున రూ.24 లక్షలు విరాళాలను సేకరించారు. మూడు గ్రామాల ప్రజలకు సం బంధించిన రహదారి ఆలపాడు నుంచి కొల్లేటికోటకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు, గోకర్ణపురం నుంచి పైడిచింతపాడు వెళ్లే రహదారిలో అనేకచోట్ల వరద ఉధృతికి గండ్లు పడ్డాయి. మూడు గ్రామాల ప్రజలు కలిసిగట్టుగా మరమ్మ తులు నిర్వహించుకునేందుకు ఆలోచన చేశారు. వీరి ఆలోచనను రాష్ట్ర వడ్డీసాధికారిక సమితి కన్వీనర్ బలే ఏసురాజు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వీరిద్ద రూ చెరో రూ.2 లక్షలు చొప్పున అందించారు. మరో ఇద్దరు వ్యక్తులు రూ.15 వేలు విరాళం ఇచ్చారు. మొత్తం రూ.28 లక్షల 15 వేలతో రోడ్లు మరమ్మతులు చేపట్టనున్నారు. భీమవరానికి చెందిన ఓ కాంట్రాక్టర్‌కు ఈ సొమ్మును అందించి త్వరలో పనులు ప్రారంభించనున్నట్టు ఏసురాజు తెలిపారు. కాగా ఆదివారం గోతుల్లో కొంత మట్టిని తోలి తాత్కాలికంగా రాకపోకలకు వీలుగా చర్యలు తీసుకున్నారు.

టీచర్ అదృశ్యం .. కేసు నమోదు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 22 : ఒక ప్రైవేటు స్కూల్‌లో పని చేస్తున్న టీచర్ అదృశ్యం అయిందని భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు చాటపర్రు రోడ్డులో నివాసం ఉంటున్న నిమ్మగడ్డ నాగేశ్వరరావు లింగపాలెం మండలం నడిపల్లిలో పాస్టర్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య ఏలూరు చాటపర్రు రోడ్డులోని ప్రైవేటు స్కూలు టీచర్‌గా పనిచేస్తున్నారు. ఆమె రెండు రోజుల క్రితం నుంచి కనిపించడం లేదని ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బదిలీల జాతర

జడ్పీలో వివిధ కేడర్లకు సంబంధించి 429 మంది

పది మంది ఎంపీడీవోలు ఇతర జిల్లాలకు..

పంచాయతీ కార్యదర్శుల బదిలీలు కూడా పూర్తి

ఏలూరుసిటీ, సెప్టెంబరు 22: ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్తయింది. దాదాపు 36 రోజుల పాటు కొనసాగిన బదిలీల ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. జిల్లాలో ఎక్సైజ్ శాఖ మినహాయించి మిగిలిన ప్రభుత్వ శాఖలకు సంబంధించి బదిలీల ప్రక్రియ పూర్తయింది. కొన్ని శాఖలకు సంబంధించి ఇప్పటికే బదిలీ ఉత్తర్వులు ఆయా శాఖాధిపతులు అందజేయగా జిల్లా పరిషత్‌కు సంబంధించి ఉద్యోగుల బదిలీ ఉత్తర్వులను జడ్పీ చైర్మన్ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం గత నెల 17వ తేదీన ఉద్యోగుల బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేసినందున ఈ బదిలీల కార్యక్రమం చేపట్టారు. జిల్లా పరిషత్ యాజమాన్యం పరిధిలోని అన్ని కేడర్లులో 429 మంది ఉద్యోగులను బదిలీ చేశారు. ఇక అంతర జిల్లా బదిలీలకు సంబంధించి ఈ జిల్లా నుంచి 10 మంది ఎంపీడీవోలను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. పంచాయతీ శాఖకు సంబంధించి పంచాయతీ కార్యదర్శులు, పంచా యతీ కార్యాలయాల్లో పని చేసే సిబ్బంది బదిలీల ప్రక్రియ కూడా పూర్తయిందని సంబంధిత శాఖాధికారులు చెబుతున్నారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సుబ్బారావు, డిప్యూటీ సీఈవో నిర్మలాజ్యోతి, జిల్లా పరిషత్ పరిపాలనాధికారులు రాఘవులు పాల్గొన్నారు.

జడ్పీ డిప్యూటీ సీఈవో, డీపీవో బదిలీ

జిల్లా పరిషత్ సీఈవో కెఎస్ఎస్ సుబ్బారావును బదిలీ చేస్తూ రిటైన్ ఆర్డరు ఇచ్చారు. అంటే ఆయన ఇక్కడే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ సీఈవోగా కొనసాగేలా ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని కోనసీమ జిల్లాలో డ్వామా డీపీవోగా పనిచేస్తున్న భీమేశ్వర్‌ను ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా డిప్యూటీ సీఈవోగా బదిలీ చేశారు. ఇక్కడ డిప్యూటీ సిఈవోగా పనిచేస్తున్న నిర్మలా జ్యోతిని బదిలీ చేశారు. ఏలూరు జిల్లా డీపీవోగా పనిచేస్తున్న తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్‌ను బదిలీ చేశారు. విజయవాడలో డీఎల్‌డీవోగా పనిచేస్తున్న కె.అనూరాధను ఏలూరు జిల్లా పంచాయతీ అధికారిగా నియమిస్తూ బదిలీ ఉత్వర్వులు జారీ చేశారు.

ఏలూరు జిల్లా డ్వామా పీడీగా పని చేస్తున్న ఎ.రామును అడిషినల్ పీడీ, ఈజీఎస్ , కృష్ణా/ ఎన్‌టీఆర్ జిల్లా డ్వామా పీడీగా బదిలీ చేశారు. విజయవాడ స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ ఈడీగా పనిచేస్తున్న కేవీ సుబ్బారావును ఏలూరు డ్వామా పీడీగా నియమితులయ్యారు. ఏలూరు జిల్లాలో సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో ఎం.హిమశైలజను గుంటూరు డీఎఫ్‌వో(టి)గా బదిలీచేశారు. చింతపల్లి టెరిటోరియల్ డీఎఫ్‌వోగా పనిచేస్తున్న సీహెచ్ సూర్యనారాయణను ఏలూరు జిల్లా సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. డీసీఎంస్ మేనేజర్‌గా వి.శ్రీలక్ష్మి నియమితులయ్యారు. ఈమె విజయవాడలో మేనేజర్(స్టోర్స్)గా పనిచేస్తున్నారు. ఏలూరు మునిసిపల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా వి.సురేంద్రబాబు నియమితులయ్యారు.



జడ్పీ ఉద్యోగుల బదిలీ ఉత్తర్వులందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

సిఫార్సులకే ప్రాధాన్యం

సాధారణంగా గతంలో ఎటువంటి సిఫార్సు లేకుండానే బదిలీల ప్రక్రియ నిర్వహించేవారు. కానీ ఈసారి ప్రజాప్రతినిధుల సిఫార్సులకే బదిలీలలో ప్రాధాన్యం కల్పించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు సిఫార్సులు చేసిన వారికే ఈ బదిలీల ప్రక్రియలో ప్రాధాన్యం లభించినట్టు సమాచారం.





సెపక్ తక్రా పోటీల్లో విద్యార్థులు.. ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, పీడీలు, పీఈటీలు

విద్యార్థుల భవిష్యత్‌ను నిర్దేశించేవి క్రీడలు

పెదవేగిలో 19 ఏళ్ల విభాగం స్కూల్ గేమ్స్ జట్ల ఎంపిక

పెదవేగి, సెప్టెంబరు 22 : విద్యార్థుల భవిష్యత్‌ను నిర్దేశించేవి క్రీడలని, ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఏదొక క్రీడలో ప్రావీణ్యత సాధించాలని పెదవేగిలోని ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వైవీఎస్ ఆచార్యులు అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో 19 ఏళ్ళ విభాగం క్రీడాపోటీలు పెదవేగిలోని గురుకుల విద్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో రాష్ట్ర స్థాయికి జిల్లాజట్లను ఎంపిక చేశామని ఎస్‌జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.జయ రాజు తెలిపారు. కుస్తీపోటీల్లో బాలురు 20 మంది, బాలికలు పదిమందిని ఎంపిక చేశా మన్నారు. సాఫ్ట్‌బాల్ విభాగంలో 16 మంది బాలురు, 16 మంది బాలికలు, బేస్‌బాల్‌లో 16 మంది బాలురు, 16 మంది బాలికలు ఎంపికయ్యారని చెప్పారు. సెపక్‌తక్రా పోటీల్లో బాలబాలికలు ఐదుగురు చొప్పున ఎంపికయ్యారని, త్రోబాల్‌లో 12 మంది బాలురు, యోగాలో ముగ్గురు బాలురు ఎంపికయ్యారని జయరాజు తెలిపారు. పీడీలు, పీఈటీలు గురుమూర్తి, విజయలక్ష్మి, రాజా, శ్రీనివాస్, కుమార్, సునీల్, సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి జిల్లా జట్ల ఎంపికలు

భీమవరం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 22 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 2024-25 విద్యా సంవత్సరానికి అండర్ 14, అండర్ 17 బాలబాలికలకు నెట్ బాల్‌కు ఈనెల 25వ తేదీ నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ పిఎస్ఎన్ మల్లేశ్వరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25వ తేదీన జడ్పీహెచ్ గొరగనమూడి, సాఫ్ట్ బాల్, బేస్‌బాల్ క్రీడలకు ఏపీఎస్‌డబ్ల్యుఆర్ఎస్ పెదవేగి, 26వ తేదీన రీఫిల్ షూటింగ్ ఎస్‌సీహెచ్‌బీఆర్ఎంహెచ్ఎస్ భీమవరం, మోడరన్ పెంటాథ్లాన్ బెల్‌వెడర్ స్కూల్, తణుకు, 28న బాస్కెట్ బాల్ క్రీడకు ఎస్‌వీజీ జడ్పీహెచ్ఎస్ మార్టేరు, 30న రగ్బీ ఏపీఎస్‌డబ్ల్యుఆర్ఎస్ ఎల్‌బీ చర్ల, అక్టోబరు 1వ తేదీన మల్కంబ్, రోప్ స్కిప్పింగ్, టేబుల్ టెన్నిస్ క్రీడలకు ఎస్‌సిహెచ్‌బీఆర్ఎంహెచ్ఎస్ భీమవరం, ఫెన్సింగ్‌కు జడ్పీహెచ్ఎస్ శృంగవృక్షం, బాక్సింగ్‌కు జడ్పీహెచ్ఎస్ పెనుమంట్రలో జిల్లా జట్లు ఎంపికలు నిర్వహిస్తున్నారన్నారు. పాల్గొనే విద్యార్థులు ఎంట్రీ ఫారం, మిడ్‌డే మీల్స్ ఎక్విటెన్స్ తప్పనిసరిగా తీసుకురావాలని మల్లేశ్వరరావు పేర్కొన్నారు.

అండర్-14 బాలుర క్రికెట్ టీమ్ ఎంపిక

ఏలూరురూరల్, సెప్టెంబరు 22: వెస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ - 14 బాలుర క్రికెట్ ఎంపిక పోటీలు ఆశ్రం మెడికల్ కళాశాలలో నిర్వహించారు. పీవీఎస్ రేవంత్‌వర్మ, కే.పీ.నారాయణ, కేబీఎస్ సుబ్బారాయుడు, జీ.గౌతమ్‌రాజ్, వీసీహెచ్.నాగగణేష్, ధీరజ్ నాయుడు, కుంద్యాజైన్, మణికంఠ, టీడీ వెంకటేశ్వరరావు, టీ.రిత్విక్ రెడ్డి, ఎన్.కార్తీక్‌వర్మ, మనోజ్‌కుమార్, జైవాన్స్, జీ.జితేష్, నాగసాయిలక్ష్మణ్, గౌతమ్, పార్థసారధి, అజిత్, కార్తికేయ, కౌశిక్‌రాయుడు, కే.పృథ్వీరాజ్, అల్తాఫహ్మద్, ఎస్.సూర్యతేజ, కే.భరత్ అవినాష్‌లను ఎంపిక చేసినట్లు అధ్యక్షుడు జీ.ఆదిత్యవర్మ, కార్యదర్శి శ్రీనివాసరాజు తెలిపారు. అక్టోబరు 4వ తేదీ నుంచి 23వ తేదీ వరకు కడపలో జరిగే ఏసీఏ ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందని తెలిపారు.



ఎంపికైన క్రికెట్ జట్టు సభ్యులు



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిదొర

'పది' పరీక్షల మాధ్యమంపై స్పష్టతనివ్వాలి : ఏపీటీఎఫ్

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 22 : విద్యా సంవత్సరం ప్రారంభమై తొలి త్రైమాసికం పూర్తయినప్పటికీ పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న బాలబాలికలకు తెలుగు మాధ్యమంలో పరీక్షలు రాసే అవకాశం ఉందో, లేదో ప్రభుత్వం ఇంతవరకు స్పష్టత నివ్వకపోవడం శోచనీయమని ఆదివారం ఏలూరులో జరిగిన ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేశారు. సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, రెడ్డిదొర మాట్లాడుతూ పాఠ శాల విద్యారంగంలో గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న పలు వివాదాస్పద నిర్ణయాలు, జీవోలు, టీచర్ల సమస్యలపై కూటమి ప్రభుత్వం వెంటనే సమీక్షించాలని డిమాండ్ చేశారు. అన్ని యాజమాన్యాల పాఠశాలల ఉపాధ్యాయులకు పదోన్నతులు చేపట్టాలన్నారు. ముఖ్యంగా 40 కిలో మీటర్లకు పైబడి చేసిన వర్క్ అడ్జస్ట్ మెంట్లను రద్దుచేసి, సంబంధిత పాఠశాలలలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయా లని కోరారు. జీవో 117 ఉత్తర్వులను రద్దు చేయాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కొత్త పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, ఈలోగా మధ్యంతర భృతి (ఐఆర్) ఇవ్వాలని కోరారు. పెండింగ్ పీఆర్సీ బకాయిలను, డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఏపీజీఎల్ఐ, పీఎఫ్ రుణాలను సకాలంలో మంజూరు చేయాలని అభ్యర్థించారు. హైస్కూల్ ప్లస్‌లకు సైన్స్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని, ఐటీడీఏ యాజమాన్యంలోని ఆశ్రమ పాఠ శాలలకు రెండో ఇంగ్లీషు టీచరు పోస్టును మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు శ్యాంసుందర్, దొరబాబు, ప్రకాష్‌రావు, రమాదేవి, భాస్కరవర్మ, తదితరులు పాల్గొన్నారు.



ఏలూరుపాడులో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన

అంబేడ్కర్ ఫ్లెక్సీ వివాదంపై దళితుల రాస్తారోకో

కాళ్ళ, సెప్టెంబరు 22 : అంబేడ్కర్ ఫ్లెక్సీ తొలగింపుపై పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలం ఏలూరుపాడు గ్రామంలో దళిత సంఘాలు భగ్గుమన్నాయి. ఆదివారం మధ్యాహ్నం ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలతో పాటు కృష్ణాజిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున దళిత నాయకులు చేరుకుని రాష్ట్రీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ట్రిబుల్ ఆర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్ ఏలూరుపాడులో దళిత నాయకులకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. అంబేడ్కర్‌ను అవమానించిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై 24 గంటల్లో కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆ ఫ్లెక్సీ నిజంగా గుడికి అడ్డుగా ఉంటే అధికారులతో చెప్పి తొలగించవచ్చని దౌర్జన్యంగా ఫ్లెక్సీని తొలగించడం పద్ధతి కాదన్నారు. సుమారు మూడు గంటల పాటు రాష్ట్రీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

సోషల్ మీడియాలో అవాస్తవ ప్రచారం : ఎస్పీ

ఏలూరుపాడులో అంబేడ్కర్ ఫ్లెక్సీని తొలగించిన ఘటన ఆసరాగా చేసుకుని కొందరు వ్యక్తులు సామాజిక మాధ్యమాలలో వైరల్ చేస్తున్న వీడియో అవాస్తవమని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలియజేశారు. సామాజిక మాధ్యమాలలో అవాస్తవాలను ప్రచారం చేయడం, కుల, ప్రాంత, వర్గ విభేదాలను రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టడం, వాటిని షేర్ చేయడం చట్ట రీత్యా నేరమన్నారు. అవాస్తవ వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తే ఆ సమాచారాన్ని వెంటనే పోలీసువారికి తెలియజేయాలని తెలియజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.





నిర్మానుషంగా మారిన భీమవరం ప్రధాన సెంటర్... ఆకివీడులో చెరువు గట్టున సేద తీరుతున్న జనం

భగ్గుమన్న సూరీడు.. వేడి గాలులతో జనం అవస్థలు

భీమవరంటౌన్/ఆకివీడు సెప్టెంబరు 22 : సూర్యుడి ప్రతాపానికి ప్రజలు విలవిల్లాడుతున్నారు. వేసవిని తలదన్నే విధంగా ఎండలు మండిపోతున్నాయి. ఇది వర్షాకాలమా లేక వేసవి కాలమా అని అంటున్నారు. ఉదయం 10 గంటల నుంచి ఎండ వేడిమికి తట్టుకోలేకపోతున్నారు. ఇళ్ళలో ఉన్నా ఏసీలు వేసుకుని కూర్చోవలసిన పరిస్థితులు కొనసాగుతున్నాయి. రెండు రోజుక్రితం అకస్మాత్తుగా వాతావరణం మారి ఎండ తీవ్రత పెరిగింది. ఉష్ణోగ్రతలు మాత్రం 34 డిగ్రీలే ఉన్నా ఎండ మాత్రం 45 డిగ్రీల తీవ్రత ఉన్నట్లు కనిపిస్తోంది.దీంతో ప్రజలు భయటకు రావాలంటే భయ పడు తున్నారు. ఆదివారం వస్తే భీమవరం పట్టణంలోని గ్రౌండ్‌లు పిల్లల ఆటలతో సందడిగా ఉంటే నిర్మానుష్యంగా మారాయి. వాతావరణ మార్పులతో రోగాలు కూడా వెంటాడుతున్నాయంటున్నారు. జ్వరాలు తగ్గడం లేదని, ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలు అనంతరం ఎండలు పెరిగిపోయాయని అంటున్నారు. భానుడు ఉగ్రరూపం దాల్చుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నా ఆకివీడు వరద ముంపు ప్రాంతాల్లో నీరు ఇంకా తగ్గముఖం పట్టడం లేదు. మరోవైపు జనం విష జ్వరాలతో అల్లాడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించి పరిష్కరించాలని కోరుతున్నారు.

క్రైమ్ కార్నర్

చికిత్సపొందుతున్న బాలుడి మృతి

ఉండి సెప్టెంబరు 22: మోటర్ సైక్లిస్ట్ ఢీకొట్టిన ప్రమాదంలో బాలుడు తలకు తీవ్రమైన గాయమై చికిత్స పొందుతున్న బాలుడు శనివారం రాత్రి మృతి చెందినట్టు ఉండి ఎస్ఐ మహమ్మద్ నజీరుల్లా తెలిపారు. ఉప్పులూరు గ్రామంలో ఈనెల 20వ తేదీ శుక్రవారం ఉదయం కొల్లి రక్షణబాబు(9) కొత్త చర్చి ఎదురుగా రోడ్ మీద వుండగా బాలుడిని వెనుకవైపు నుంచి వచ్చిన మోటర్‌సైక్లిస్ట్ బలంగా ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయమైంది. భీమవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి 11 గంటల సమయంలో మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తాగి వచ్చి కోర్టులో హడావుడి

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 22 : ఒక హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వ్యక్తి కోర్టు వాయిదాకు మద్యం తాగి వచ్చి కోర్టులో హడావుడి చేయడంతో కోర్టు ఉత్తర్వులు మేరకు ఏలూరు త్రి టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. 2018లో ఏలూరు వన్‌టౌన్‌లోని ఒక హత్యకేసులో నిందితుడిగా ఉన్న ఏలూరు తూర్పువీధినకు చెందిన తిరుమల రామశివ (38) ఏలూరు జిల్లా కోర్టుకు కేసు వాయిదాలకు వస్తున్నాడు. ఈనెల 13వ తేదీన కోర్టు వాయిదాకు వచ్చిన అతను మద్యం తాగి కోర్టులో దురుసుగా ప్రవర్తించాడు. దీంతో కోర్టు ఆదేశాల మేరకు ఏలూరు త్రిటౌన్ పోలీసులకు ఉత్తర్వులు జారీ కావడంతో శనివారం రాత్రి కేసు నమోదు చేశారు.

బొర్రంపాలెంలో 12 మందిపై అట్రాసిటీ కేసు నమోదు

టి.నర్సాపురం, సెప్టెంబరు 22 : కులం పేరుతో దూషించిన పన్నెండు మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.జయబాబు తెలిపారు. బొర్రంపాలెంలో ఓ సామాజిక వర్గానికి చెందిన కొంతమంది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించే విధంగా సోషల్ మీడియాలో శనివారం పోస్టు పెట్టడంతో ప్రశ్నించిన గుండె నాగేంద్రతో పాటు మరికొందరిని దూషించారు. బాధితుల ఫిర్యాదుతో తోట ప్రసాద్, సూరితో పాటు మరో పదిమందిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చించినాడలో ఆరుగురిపై కేసు..

యలమంచిలి, సెప్టెంబరు 22: మండలంలోని చించినాడ గ్రామానికి చెందిన కానేటి బాలరాజును కులం పేరుతో దూషించిన అదే గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గుర్రయ్య తెలిపారు. ఈనెల 19వ తేదీన కానేటి బాలరాజు తన పట్టాభూమి(లంకభూమి) వద్దకు వెళ్లగా అదే ప్రాంతంలో ఉన్న ఆరుగురు వ్యక్తులు తనను కులం పేరుతో దూషించారని బాలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి.. 9 మంది అరెస్టు

పెనుగొండ, సెప్టెంబరు 22 :పేకాట స్థావరంపై దాడి చేసి 9 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ గంగాధర్ తెలిపారు. పెనుగొండ మండలం చెరుకువాడ బత్రింకలాంబ గుడి సమీపంలో ఆదివారం సాయంత్రం పేకాట స్థావరంపై దాడి చేసినట్లు తెలిపారు. దాడిలో 9 మందిని అదుపులోకి తీసుకుని 54, 600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బైక్‌ను తప్పించబోయి అదుపుతప్పి పొదల్లోకి..



జీలుగుమిల్లి, సెప్టెంబరు 22 : దర్భగూడెం వద్ద జాతీయ రహదారిపై కారు బైక్ ఢీకొన్న ఘటన ఆదివారం జరిగింది. అప్పలరాజు గూడెంకు చెందిన ఇద్దరు వ్యక్తులు మద్యం మత్తులో బైక్‌పై వస్తున్నారు. దర్భగూడెం సమీపంలో జాతీయ రహదారిపై ఎదు రుగా వస్తున్న వాహనాన్ని చూడ కుండా కారును ఢీకొట్టారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనాన్ని తప్పించ బోయిన కారు అదుపు తప్పి పక్కనే ఉన్న పొదల్లోకి దూసుకుపోయింది. కారులో మహిళకు గాయాలయ్యాయి. స్థానికులు గాయపడిన మహిళను జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ నవీన్‌కుమార్ పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తుల్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

భర్త ఎదుటే భార్య,కుమార్తె కిడ్నాప్

ముదినేపల్లిలో సినీ ఫక్కీలో ఘటన

ముదినేపల్లి, సెప్టెంబరు 22 : భర్తతో కలసి బస్సులో వేరే రాష్ట్రానికి వెళ్తున్న ఓ వివాహితను, ఆమె పదినెలల చిన్నారితో సహా కిడ్నాప్ చేసిన ఘటన శనివారం రాత్రి ముదినేపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ముదినేపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ తన కుమార్తెను కర్నాటక రాష్ట్రంలోని రాయచూర్‌కు చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేసింది. వారికి పది నెలల పసిపాప ఉంది. కొద్ది రోజుల క్రితం రాయచూర్ నుంచి ఆమె తన భర్త, కుమార్తెతో కలసి పుట్టింటికి వచ్చింది. తిరిగి ఈ నెల 21వ తేదీ రాత్రి రాయచూర్ వెళ్లేందుకు ముదినేపల్లిలో బస్ స్టేషన్‌లో బస్సు ఎక్కారు. అయితే గ్రామానికి చెందిన అచ్యుత రమేష్ అనే యువకుడు బస్ స్టేషన్‌కు వచ్చి 'రాత్రి సమయంలో ప్రయాణం చేయ వద్దని మీ అమ్మ మిమ్మల్ని ఇంటికి తీసుకురమ్మని తనను పంపింద'ని చెప్పగా, వారు బస్సు నుంచి దిగిపోయారు. బైక్‌పై ఆమె తన చిన్నారితో సహా ఎక్కిన అనంతరం ఆమె భర్త ఎక్కుతుండగా, రమేష్ స్పీడ్‌గా వెళ్లిపోయాడు. విషయాన్ని అల్లుడు తన అత్తకు తెలియజేయగా ఆమె ఆదివారం ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో రమేష్ అనే వ్యక్తి తన కుమార్తెను, మనుమరాలిని కిడ్నాప్ చేశాడని ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి ఎస్ఐ వెంకట్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణం : జడ్పీ చైర్‌పర్సన్



టీడీపీ నాయకులతో సమావేశమైన పద్మశ్రీ

కొయ్యలగూడెం, సెప్టెంబరు 22: ఉమ్మడి జిల్లా అన్ని గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణం చేపడుతున్నామని జడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ తెలిపారు. బయ్యన్నగూడెంలో ఏఎంసీ మాజీ చైర్మన్ పారేపల్లి రామారావు ఇంటి వద్ద టీడీపీ నేతలతో ఆదివారం సమావేశం అయ్యారు. జిల్లా పరిషత్ నిధుల ద్వారా ఉమ్మడి జిల్లాను అన్ని విధాల అభివృద్ధి చేస్తామన్నారు. జిల్లాలో టీడీపీ బలోపేతానికి అంకితభావంతో పని చేస్తామన్నారు. జిల్లా అంతా పర్యటించి ముఖ్య నాయకులతో సమావేశం అవుతున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్, మండల టీడీపీ అధ్యక్షుడు పారేపల్లి నరేష్, పారేపల్లి వీరాస్వామి, బొంతా దుర్గాప్రసాద్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వరదలతో ఇళ్లు, పశు నష్టం జాబితా విడుదల



జాబితాను ప్రదర్శిస్తున్న ఆర్డీవో ఖాజావలి

ఏలూరు రూరల్, సెప్టెంబరు 22: ఏలూరు డివిజన్ పరిధిలో భారీ వర్షాలు, వరద ప్రభావిత ప్రాంతాల్లో దెబ్బతిన్న ఇళ్లు, పశునష్టం జాబితా సిద్ధం చేశారు. రెవెన్యూ డివిజన్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల్లో నోటీసు బోర్డులో జాబితా ఉంచినట్లు ఆర్డీవో ఎస్కే.ఖాజావలి ఆదివారం తెలిపారు. బాధితులు జాబితా పరిశీలించుకుని అభ్యంతరాలు ఉంటే తక్షణం సంబంధిత తహసీల్దార్ల దృష్టికి తీసుకురావాలని కోరారు. రూరల్ మండలం మాదేపల్లి, శ్రీపర్రు, గుడివాకలంక, పైడిచింతపాడు, కోటేశ్వరదుర్గాపురం గ్రామాల్లో నష్టం వివరాలు ఆయన తెలిపారు.

కొత్త పట్టిసీమలో పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పోలవరం, సెప్టెంబరు 22: పోకొత్త పట్టిసీమ సర్పంచ్ షైగాపుల విజయదుర్గ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు ఆదివారం వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యదర్శి అత్తిలి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులకు రక్షణ పరికరాలైన గ్లౌజులు, బూట్లు పంపిణీ చేశామని, నిరంతరం శ్రమించే పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందుల పంపిణీ చేశామన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఇంటింటికీ తిరిగి 100 రోజుల పాలనలో జరిగిన అభివృద్ధి పనులు వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గ్రంథ పఠనంతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్



పుస్తక పఠనంలో విద్యార్థులు

పెదవేగి, సెప్టెంబరు 22: గ్రంథ పఠనంతో విద్యార్థి భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని లైబ్రేరియన్ తోట అరుణ్‌కుమార్ అన్నారు. శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం జరిగింది. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలన్నారు. గ్రంథాలతో గడిపే ప్రతిక్షణం ఎంతో విలువైనదని, విజ్ఞానదాయక అంశాలను నేర్చుకోవడానికి గ్రంథాలయాలు దోహదపడతాయని చెప్పారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా గ్రంథాలయ దర్శనం చేయాలని, అప్పుడే నిజమైన విజ్ఞానం మనసొంతమవుతుందని ఆయన వివరించారు.

వైద్య శిబిరంలో 600 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

కుక్కునూరు, సెప్టెంబరు 22: మండలంలోని శ్రీధర గ్రామంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు ధారా బాలాజీరావు ఆధ్వర్యంలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ప్రోగ్రాం చైర్మన్ షేక్ అజీమ్, డాక్టర్ ముదికొండ రామకృష్ణ పర్యవేక్షణలో 11 మంది డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించారు. దాదాపు 600 మందికి పరీక్షలు చేసి రూ. లక్షా 20వేలు విలువ చేసే మందులు పంపిణీ చేశారు. ముందుగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాస్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, తాళ్ళూరి సురేష్, ఎస్.విద్యాసాగర్, శ్రీనివాసరావు, పలివెల భూషన్‌రావు, బాలయోగి, తదితరులు పాల్గొన్నారు.

ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై చర్యలు తీసుకోవాలి

పోలవరం సెప్టెంబరు 22: అంబేడ్కర్ ఫ్లెక్సీని చింపి అవమానించిన ఎండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజును పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని దళిత మహాసభ రాష్ట్ర కార్యదర్శి సొబ్బన మోహన్ డిమాండ్ చేశారు. ఏలూరుపాడులో అంబేడ్కర్ ఫ్లెక్సీ చింపి రాజ్యాంగ నిర్మాతను అవమానించడంపై దళితులు నిరసన వ్యక్తం చేశారు. ఉండి ఎమ్మెల్యేపై రాజద్రోహం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సొబ్బన ఆనంద్, సొబ్బన రాజశేఖర్‌బాబు, బచ్చల వెంకటరమణ, నాగార్జున, కుంజం నాగబాబు, కొండే ఏసు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీ

ఏలూరు క్రైం, సెప్టెంబరు 22 : జిల్లా వ్యాప్తంగా పోలీసులు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌ధారణపై అవగాహన కల్పించారు. వాహనం నడిపేవారు కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనాలకు బీమా, సరైన రికార్డులు ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలన్నారు. హెల్మెట్ ధారణ వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు కాపాడుకోవచ్చునని ప్రమాదాల్లో 80 శాతం తలకు దెబ్బతగలడం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని, హెల్మెట్ ధరించి ఉంటే కచ్చితంగా ప్రాణాలు కాపాడుకోవచ్చని సూచించారు. వాహనాలకు రిజిస్టర్ నెంబర్ మాత్రమే ఉండాలని నెంబర్ ప్లేట్లపై ఎలాంటి రాతలు ఉండకూడదని సూచించారు.



ఏలూరులో మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బడేటి చంటి, జంగారెడ్డిగూడెంలో నేతల ప్రచారం, ఉంగుటూరు, నిడమర్రు మండలాల్లో ఎమ్మెల్యే ధర్మరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని ప్రచారం

సంక్షేమ పాలన

హామీల అమలుతో ప్రజలకు మేలు

ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో నేతలు

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 22: రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 100 రోజుల్లోనే ప్రజలకు ఎన్నో సంక్షేమ ఫలాలను అందించారని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 42వ డివిజన్‌లో ఆదివారం ఎమ్మెల్యే చంటి పర్యటించారు. వంద రోజుల్లో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తామన్నారు. హామీలు నేరవెర్చేక్రమంలో ప్రజల ఆశీర్వాదం కావాలన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే ఐదేళ్లలో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ప్రజలు ఏ సమస్య వచ్చినా తనను కలవచ్చన్నారు. 24గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు త్రిపర్ణ రాజేష్, ఆర్నేపల్లి మధు, ఉప్పాల జగదీష్‌బాబు, సూర్యనారాయణ, గోవింద్, శెట్టి సరిత, వేదిరెడ్డి శంకర్, కార్పొరేటర్ సత్యవతి, జనసేన ఇన్‌ఛార్జ్ అద్దాల శ్రీనివాస్, బీజేపీ ఇన్‌చార్జ్ బర్మా లక్ష్మణరావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పెద్దఎత్తున పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజులలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు వెళ్తుందని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పెనుమర్తి రామకుమార్ అన్నారు. పదో సచివాలయం అడ్మిన్ చిట్టిబాబు ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీచేసి గోడలకు స్టిక్కర్లు అతికించారు. రామ్‌కుమార్ మాట్లాడుతూ వంద రోజుల్లోనే పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్లు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, మెగా డిఎస్సీ, పెండింగ్ ధాన్యం బిల్లుల విడుదల, వరద సహాయం కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మద్దిపాటి నాగేశ్వరరావు, చేను ప్రసాద్, కోటగిరి ప్రమీల, కన్నా కృష్ణ, కొత్తూరి సత్తిబాబు, చిట్టూరి బాపినీడు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

● నిడమర్రు: కూటమి ప్రభుత్వం 100 రోజులలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరంజనేయులు అన్నారు. తోకలపల్లి గ్రామంలో ఇదిమంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 100 రోజుల్లో మెగా డీఎస్సీ, అన్న క్యాంటిన్లు ప్రారంభం, సామాజిక ఫించన్లు పెంపు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, 1న ఉద్యోగులకు జీతాలు అందించిన ఘనత సాధించిందన్నారు. దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ కార్యక్రమం చేస్తామన్నారు. అనంతరం గ్రామంలో ఇంటంటికీ పర్యటించి ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముత్యాల స్వామి, గణసల ఆదినారాయణ, పొట్నూరి సింహాచలం, సత్తినీడి నాని, పోశింశెట్టిత రాంమూర్తి, పైడికొండల శివాజి, తదితరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: మండలంలోని గొల్లగూడెం, కాకర్లమూడి. వీపీ పురం గ్రామాలలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ధర్మరాజు పాల్గొన్నారు. సర్పంచ్‌లు కరపా వెంకట శ్రీనివాసరావు, కాళ్ళ సత్యనారాయణ, శింగులూరి ధనలక్ష్మి, నెక్కలపూడి సత్యనారాయణ, వేములపల్లి సుధీర్, పాతూరి విజయకుమార్, చింతల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



చొదిమెళ్లలో ప్రతిజ్ఞ చేస్తున్న సచివాలయ సిబ్బంది, కె.కోట డిగ్రీ కళాశాల విద్యార్థుల ర్యాలీ, దర్భగూడెంలో అవగాహన ర్యాలీ

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం

కామవరపుకోట, సెప్టెంబరు 22: పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ విభాగం, భారత ప్రభుత్వ యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించి మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా అక్టోబరు 2 వరకు కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.ఉషారాణి, కె.ఇందిరాకుమారి, దారావతు మల్లేశ్, పి.ఏడుకొండలు, విజయకృష్ణ, ఉమా తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: దళిత బహుజన రిసోర్స్‌సెంటర్ ఆధ్వర్యంలో చొదిమెళ్ళ గ్రామ సచివాలయం సిబ్బంది స్వచ్ఛతాహి సేవా ప్రతిజ్ఞ నిర్వహించారు. వీఆర్వో టీవీ.ప్రసాద్ మాట్లాడుతూ పరిశుభ్రతను పాటిస్తూ సామాజిక బాధ్యతతో ఉండాలని, ప్రతీ ఒక్కరు స్వచ్ఛ ఆంధ్రా, స్వచ్ఛభారత్ స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. కార్యదర్శి టీడీవీ ప్రసాద్, వై.జ్యోతి, డీబీఆర్‌సీ ఏరియా కోఆర్డినేటర్ ఝాన్సీరాణి, పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: గ్రామాలు పరిశుభ్రంగా ఉండేందుకు ప్రతి ఒక్కరు ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో పాల్గొనాలని దర్భగూడెం కార్యదర్శి సతీష్ అన్నారు. గ్రామంలో మురుగునీటి నిల్వలు లేకుండా, ప్లాస్టింగ్ వినియోగం నిషేధిస్తూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. రోగాలకు దూరంగా ఉండాలన్నారు. స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, కూటమి నాయకులు ఉన్నారు.

ఎండీయూ వ్యవస్థ రద్దు చేసి.. కార్డులు విభజించాలి

ఏలూరు రూరల్, సెప్టెంబరు 22: వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎండీయూ వ్యవస్థను రద్దు చేశాకే రేషన్ కార్డుల విభజన చేపట్టాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం కోరింది. జిల్లా అధ్యక్షుడు రాజులపాటి గంగాధరరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎండీయూ వ్యవస్థతో ఐదేళ్లు తీవ్రంగా నష్టపోయామని, కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. గ్రామాల్లో ఒక్కొ చౌకదుకాణం పరిధిలో 600 కార్డులు, పట్టణాలు, నగరాల్లో 800 కార్డుల చొప్పున కేటాయించాలని కోరారు. కొత్త దుకాణాల ఏర్పాటు పేరుతో ఉన్న డీలర్లకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. ఒక్కొక్క రేషన్ దుకాణానికి సుమారు 800 కార్డులకు తగ్గకుండా అన్ని దుకాణాలకు సమానంగా కేటాయించాలన్నారు. హేతుబద్ధీకరణలో భాగంగా రేషన్ దుకాణాలకు కేటాయించిన కార్డులను తగ్గించడం వలన తమ పారితోషికం తగ్గిపోతుందన్నారు. రేషన్ దుకాణాల అద్దెలు, విద్యుత్ చార్జీలు దృష్టిలో పెట్టుకుని డీలర్లకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గోర్‌బోలి భాషను అధికారికంగా గుర్తించాలి



సమావేశమైన గిరిజన లంబాడీలు

చింతలపూడి, సెప్టెంబరు 22: గిరిజన లంబాడీలు మాట్లాడే గోర్‌బోళి భాషను ప్రభుత్వం అధికారికంగా గుర్తించాలని, రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్‌లో చేర్చాలని ఎస్టీ బంజారా లంబాడీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూక్యా నాగేశ్వరరావు కోరారు. నాగిరెడ్డిగూడెంలో సంఘ సమావేశం ఆదివారం నిర్వహించారు. పలువురు గిరిజన నాయకులు మాట్లాడుతూ లంబాడీలకు చట్ట సభల్లో అవకాశం కల్పించాలని, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, తండాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సేవాలాల్ మందిరాలు నిర్మించాలని, అన్ని ప్రభుత్వ శాఖల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించి పదోన్నతులు కల్పించాలని కోరారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవడానికి జిల్లాకు పది లక్షల సహాయం అందించాలని కోరారు. అనంతరం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. టి.కిమ్యానాయక్, జి.కృష్ణనాయక్, డి.రాజ్‌బాబ్ నాయక్ మాట్లాడారు. నాగిరెడ్డిగూడెం అధ్యక్ష, కార్యదర్శులుగా ఇ.కాజు నాయక్, భూక్యా అంజనేయులు, గౌరవ అధ్యక్షుడిగా భూక్యాసోములు, కోశాధికారిగా రవికుమార్‌ను ఎన్నుకున్నారు.

కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వాహనాలు పట్టివేత

పెదపాడు, సెప్టెంబరు 22: చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న రెండు వాహనాలను పోలీసులు పట్టుకున్నారు. పెదపాడు శివారు గండిచెరువుగట్టు, తోటగూడెం ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి కోళ్లవ్యర్థాలతో కూడిన రెండు ఐషర్ వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు హెచ్‌సీ సువర్ణరాజు తెలిపారు. వాహనాలను స్వాధీనం చేసుకుని వాటిలో కోళ్లవ్యర్థాలను గొయ్యి తీసి పూడ్చి పెట్టించినట్లుగా తెలిపారు. వాహన యజమానులు, డ్రైవర్లు, చెరువు యజమానులపై కేసు నమోదు చేసి పెదపాడు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఏలూరు కార్పొరేషన్ ఈఈగా సురేంద్రబాబు

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 22: నగరపాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఈ సురేంద్రబాబును నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. జూలై నెలాఖరు వరకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిం చిన భాస్కరరావు ఉద్యోగ విరమణ చేశారు. హౌసింగ్ శాఖ ఈఈ స్వామినాయుడును ఇన్‌చార్జిగా నియమించారు.

ల్యాండ్ సీలింగ్ భూములను పేదలకు పంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న జీవరత్నం

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 22: పంగిడిగూడెంలో ల్యాండ్ సీలింగ్ భూములను నిరుపేదలకు పంపిణీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం డిమాండ్ చేశారు. పంగిడిగూడెం గ్రామ మహాసభ పెండెం బజార్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఎ.ప్రభాకరరావు సీపీఎం జెండాను ఆవిష్కరించారు. ప్రజా స్థానిక సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని సభ్యులకు సూచించారు. అనంతరం ఎం.బాలయ్య, అందుగుల ప్రభాకరరావు, ఎం.అశోక్‌కుమార్‌ను మూడు శాఖలకు కార్యదర్శులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జి.బాలయ్య, కె.సుబ్బారావు, రాజశేఖర్, సూర్యచంద్రరావు, కాంతమ్మ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ప్రతినిధుల సమావేశం

ఏలూరు రూరల్, సెప్టెంబరు 22: లయన్స్ భవనంలో జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు అధ్యక్షతన గ్లోబల్ యాక్షన్ టీమ్, లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సమావేశం నిర్వహించారు. వేణుబాబు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలకు పునరంకితం కావాలన్నారు. అంబటి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ క్లబ్‌లో సభ్యత్వం పొందడం ఒక సదవకాశమని, సభ్యులు ఉపయోగించుకుంటూ ఫౌండేషన్‌కు విరాళాలు ఇచ్చి సహాయపడాలని కోరారు. మాజీ గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, ఎం.ఉపేంద్ర, ఎన్‌వీవీఎస్.పాపారావు, డాక్టర్ సుబ్బారావు, వీ.సత్యస్వరూప్, ఎల్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పోలవరంలో భారీ వర్షం

పోలవరం, సెప్టెంబరు 22: మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. గత రాత్రి, ఉదయం కురిసిన వర్షానికి మండలంలో పలుచోట్ల పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పోలవరం నుంచి ఇటుకలకోట మార్గంలో పట్టిసీమ ఎత్తిపోతల పథకం డెలివరీ ఛానల్, బంగారమ్మపేట వద్ద పట్టిసీమ ఎత్తిపోతల పథకం వద్ద రోడ్లపై ఉన్న భారీ గోతుల్లో నీరు చేరి గోతులు కానరాక వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు.

గణేశ్ ఉత్సవాల ముగింపు.. అన్న సమారాధన

పోలవరం, సెప్టెంబరు 22ముప్పిరిశెట్టివారి వీధిలో గణేశ్ ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం అన్న సమారాధన నిర్వహించారు. సుమారు రెండు వేల మందికి పైగా భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



నాగులపల్లిలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రైతు సంఘ నేతలు

రాష్ట్ర రైతు సదస్సును జయప్రదం చేయండి

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 22: ద్వారకాతిరుమలలో ఈనెల 27న జరుగనున్న రాష్ట్ర రైతుసదస్సుకు జిల్లా వ్యాప్తంగా రైతులు హాజరుకావాలని రైతు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ పిలుపునిచ్చారు. సభ విజయవంతం చేయాలని కోరుతూ ఎం.నాగులపల్లి, పంగిడిగూడెం, నారాయణపురం, గుణ్ణం పల్లి తదితర గ్రామాల్లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. కరపత్రాలను ఆవిష్కరించి రైతులకు పంపిణీ చేశారు. సదస్సులో రైతాంగసమస్యలు పరిష్కరించాలని కోరుతూ తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. అన్ని పంటలకు మద్దతు ధర కల్పించాలని కోరారు. కట్టా భాస్కరరావు, కె.శ్రీనివాస్, కృష్ణారావు, గుర్రం రాంబాబు, తూంపాటి మురళి, సోమరాజు, పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

గుడివాకలంకలో పోషకాహార మాసోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో

ఏలూరు రూరల్, సెప్టెంబరు 22: గుడివాకలంక గ్రామంలో పోషకాహార మాసోత్సవంలో భాగంగా బాలికలకు పౌష్టికాహారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో ఎ.పద్మావతి మాట్లాడుతూ ఆరోగ్యాన్ని పెంపొందించే విటమిన్లు, మినరల్స్, కాల్షియం, ఐరెన్, ఫోలిక్ యాసిడ్ ఉండే ఆహార పదార్థాలు తెలియజేశారు. కిశోర బాలికలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం, ఆశావర్కర్లు, పాల్గొన్నారు.

అంగన్వాడీల్లో సీమంతం, అన్నప్రాసన



చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న అంగన్వాడీలు

దెందులూరు, సెప్టెంబరు 22: మహిళలకు వారి అభివృద్ధి, సంక్షేమంతో పాటు ప్రభుత్వం పౌష్టికాహార మాసోత్సవాల పేరుతో అంగన్వాడీ కేంద్రాల్లో సామూహిక సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహిస్తుందని అంగన్వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ చిట్టమ్మ అన్నారు. పెరుగుగూడెం అంగన్వాడీ కేంద్రాల పరిధిలో గర్భిణులకు ఆదివారం సీమంతం నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రాసన చేశారు. అంగన్వాడీ టీచర్లు లక్ష్మీబాయ్, జ్యోతి, వెంకటేశ్వరమ్మ, ఏఎన్ఎంలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

ముత్తారెడ్డికి మాజీ మంత్రి పీతల సుజాత పరామర్శ



ముత్తారెడ్డిని పరామర్శించిన సుజాత, నేతలు

చింతలపూడి, సెప్టెంబరు 22: ఇటీవల బైపాస్ సర్జరీ చేయించుకున్న ఏఎంసీ మాజీ అధ్యక్షుడు జగ్గవరపు ముత్తారెడ్డిని మాజీ మంత్రి పీతల సుజాత పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు సీనియర్ కార్యకర్త ఎస్.ఈశ్వరకుమార్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె వెంట టీడీపీ నాయకులు టి.చంద్రశేఖరరెడ్డి, బండెల ఆశీర్వాదం, దారా వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన ఇళ్లకు రెవెన్యూ నష్ట పరిహారం

పోలవరం, సెప్టెంబరు 22: మండలంలో ఇటీవల వర్షాలకు కూలిన ఇండ్లకు పరిహారాలు ఇంటి యజమాని ఖాతాలకు నేరుగా జమచేయడం జరుగుతుందని, బాధితులు నేరుగా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని డీటీ ప్రసాద్ ఆదివారం తెలిపారు. మండలంలో మహాలక్ష్మీదేవి పేటలో ఇళ్లు కోల్పోయిన వారికి ప్రభుత్వం తరపున నష్టపరిహారం ఈ నెల 24న వారి ఖాతాలకు జమచేయడం జరుగుతుందన్నారు. బాధితులు సోమవారంలోపు దరఖాస్తు చేసుకుంటే పరిహారం అందజేయడం జరుగుతుందన్నారు.

పంట నష్ట వివరాలు నమోదు

జీలుగుమిల్లి, సెప్టెంబరు 22: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇళ్ల డ్యామేజీ కావటంతో ఆయా వివరాలను నమోదు చేశామని, ఎవరికైనా అభ్యంతరాలు ఉన్నా దీంతోపాటు ఇంకా నష్టం వివరాలు ఎవరివైనా నమోదు చేయకపోయినా 24 గంటల్లో తహసీల్దారు కార్యాలయంలో సంప్రదించాలని తహసీల్దారు బి.సందీప్ చెప్పారు.

నేడు ఉపాధి పనులపై ప్రజా వేదిక

జీలుగుమిల్లి, సెప్టెంబరు 22: మండలంలో ఇటీవల జరిగిన ఉపాధి హామీ పనులపై సోమవారం ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కెఎస్ఆర్.కృష్ణప్రసాద్ చెప్పారు. అయా పనుల నివేదిక పనులు జరిపిన తీరును సోషల్ ఆడిట్‌లో ప్రిసైడింగ్ అధికారి ఎదుట తెలుపుతారన్నారు.

నేడు రాజవరంలో గ్రామసభ

కొయ్యలగూడెం, సెప్టెంబరు 22: మండలంలోని రాజవరంలో గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగుతుందని తెలిపారు. ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన తెలిపారు.

ట్రిపుల్ ఐటీలో స్వచ్ఛతా హీ సేవ



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న విద్యార్థులు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 22: నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లోని ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యాంపస్‌లో పిచ్చి మొక్కలను తొలగించారు. డైరెక్టర్ అమరేంద్ర కుమార్ అభినందించారు.



ఏలూరులో భూలోకమ్మ జాతర, ఏలూరు రూరల్‌లో కలశాలతో భక్తుల ఊరేగింపు, శ్రీరామవరంలో గంగానమ్మకు ఎమ్మెల్యే చింతమనేని పూజలు, చింతలపూడి ముత్యాలమ్మ జాతరలో ఊరేగింపు

అమ్మవార్ల జాతర

గ్రామాల్లో ప్రత్యేక వేషధారణలతో భారీ ఊరేగింపు

ఏలూరు కార్పొరేషన్, సెప్టెంబరు 22: బావిశెట్టివారిపేటలో గ్రామదేవత భూలోకమ్మ వార్షిక సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక విద్యుద్దీపాలంకరణతో దేవతామూర్తుల ప్రతిమలు భక్తులను ఆకట్టుకున్నాయి. విచిత్ర వేషాలు, డప్పు వాయిద్యాలు నడుమ అమ్మవారి ఊరేగింపు సాగింది. ఎమ్మెల్యే బడేటి చంటి, వైసీపీ నేత మామిళ్ళపల్లి జయప్రకాష్, పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అభివృద్ధి కమిటీ చైర్మన్ మేకల సీతయ్య, కమిటీ సభ్యులు నిమ్మల శ్రీను, బావిశెట్టి నందకుమార్, వెంపల అనీల్‌కుమార్, కందుకూరి ఈశ్వరరావు, జున్నూరి నరసింహారావు, సంకాబత్తుల నాగరాజు, గుండు శివాజీ, ఓళ్ళ శ్రీను, లంకలపల్లి సతీష్, ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వైభవంగా గంగానమ్మ సంబరం

ఏలూరు రూరల్: స్థానిక 47వ డివిజన్ రాణీనగర్‌లో వందనాల దుర్గా భవాని, శ్రీనివాస్ ఆధ్వర్యంలో గంగానమ్మ, పోతురాజుబాబు స్నానసంబరం ఘనంగా నిర్వహించారు. కలశాలతో నదీజలాలు తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారిని ఊరేగించారు. భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ కలిపిన నీళ్ల వారబోసి పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే బడేటి చంటి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రాణీనగర్‌లో కోదండ రామాలయం అభివృద్ధి కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

శ్రీరామవరంలో..

దెందులూరు: శ్రీరామవరంలో గంగానమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. ప్రజలంతా పాడి పంటలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అమ్మవారికి పూజలు చేశారు. గంగానమ్మకు భక్తులు పసుపు, కుంకుమ, బోనాలను సమర్పించారు. విచిత్ర వేషధారణ, బ్యాండు సన్నాయిలతో అమ్మవారి ఊరే గింపు సాగింది. మోతుకూరి నానిబాబు, మాగంటి మిల్లుబాబు, ఆనంద్, రాజు, భక్తులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ గ్రామోత్సవం

చింతలపూడి: వెలమపేటలోని ముత్యాలమ్మ ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం భారీ గ్రామోత్సవం నిర్వహించారు. కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు జరిపి సాయంత్రం నుంచి వివిధ విచిత్ర వేషధారణలు, కోలాటం, అమ్మవార్ల రూపాలతో వేషధారణలు, అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. మెయిన్ రోడ్డు, ఘంటావారివీధి, రామకృష్ణానగర్, మారుతీనగర్ వరకు డప్పులు, డాన్సులతో ఊరేగించారు. వెలమపేటకు చెందిన కుటుంబాల వారు ముగింపు ఉత్సవాల్లో భారీగా పాల్గొన్నారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి: రాట్నాలకుంట రాట్నాలమ్మకు ఆదివారం విశేష పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి పాలపొంగలి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు పావులూరి రామసత్యనారాయణశర్మ, రుద్రపాక దుర్గా శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు. భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఈవో సతీష్‌కుమార్ తెలిపారు.

సూర్య దేవాలయంలో విశేష పూజలు

ఏలూరు కార్పొరేషన్: పవరుపేట స్టేషన్ రోడ్డులోని ధన్వంతరి వైద్య భగవానుని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సూర్య నమస్కార పూజలు జరిపారు. ఆలయ ప్రదిక్షణలు నిర్వహించి అర్చకుల నుంచి రక్షాబంధనాలు కట్టించుకుని వనమూలికల తీర్థాన్ని స్వీకరించారు.

నగరేశ్వరస్వామికి వెండి నామాలు బహూకరణ

పోలవరం: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి సమేత నగరేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు వెండి నామాలు బహూకరించినట్లు అర్చకులు ఫణికుమార్ శర్మ తెలిపారు. కొత్తగుండు వెంకట సత్య సూర్యనారాయణ మీనా దంపతులు వెండి త్రినేత్ర నామాలు బహూకరించి పూజలు చేశారు.


ముసునూరు ప్రజావేదికలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి


వేమవరప్పాడులో ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లు ఇస్తున్న కామినేని


చనుబండలో పాల్గొన్న నేతలు


పెదలంకలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ఇది మంచి ప్రభుత్వం

» ప్రతి హామీని నెరవేరుస్తాం : మంత్రి పార్థసారథి » కూటమిలో అభివృద్ధి పరుగులు : ఎమ్మెల్యే కామినేని

ముసునూరు, సెప్టెంబరు 22: ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. మండలంలోని గుళ్ళపూడి, వలసపల్లి గ్రామాల్లో ఆదివారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొని వందరోజుల కూటమి పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై ప్రతి ఇంటికి వెళ్ళి వివరించి సమస్యలడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈ రెండు గ్రామాల్లో రూ. 51 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం ముసునూరు ఎస్సీ, బీసీ కాలనీల్లో రూ. 30 లక్షలతో సీసీ రోడ్లు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఆయన జడ్పీ పాఠశాలలో ప్రజావేదిక బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చిన్నాభిన్నం చేసిందన్నారు. సీఎం చంద్రబాబు వందరోజుల పాలనలో సంక్షోభం లో కూడా సంక్షేమాన్ని, అభివృద్ధిని ముందుకు తీసుకు వెళ్ళేలా అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నేరవేర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసున్నారన్నారు. వందరోజుల పాలనలో పెన్షన్ల పెంపు, మెగా డీఎస్సీ, రైతులకు ధాన్యం కొనుగోలు బకాయిలు చెల్లింపు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, అన్న క్యాంటీన్ల పునఃప్రారంభం, వరద బాధితులను ఆదుకోవడంతో ఇది మంచి ప్రభుత్వమని ప్రజలు కితాబిస్తున్నారని అన్నారు. భవిష్యత్‌లో రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసి, యువతకు ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రజల నుంచి అందిన ఇళ్ళస్థలాలు, రహదారులు, డ్రైనేజీలు, మంచినీరు తదితర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుం టామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్ ఆధ్వర్యంలో మంత్రిని సన్మానించారు. సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మీయా, ఎంపీపీ కొండా దుర్గాభవాని, జడ్పీటీసీ డాక్టర్ ప్రతాప్, ఎంపీటీసీలు టి.కృష్ణ కుమారి, సీహెచ్.లక్ష్మీ, పార్టీ మండల అధ్యక్షుడు దేవినేని ధలరాం, నియోజకవర్గ బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నక్కా యోహాను, ఉప సర్పంచ్ తోట శ్రీను, క్లస్టర్ ఇన్‌చార్జ్ గార్లపాటి నరసింహారావు, జనసేన ఉమ్మడి కృష్ణా జిల్లా అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో పరుగులు..

చాట్రాయి: వైసీపీ అస్తవ్యస్త పాలనతో ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో ఉన్నా సీఎం చంద్రబాబు తన పాలనా దక్షతతో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారని తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు అన్నారు. చనుబండలో ఆదివారం ఇది మంచి ప్రభుత్వంలో భాగంగా కూటమి శ్రేణులు సచివాలయ సిబ్బందితో కలసి ఇంటింటికీ వెళ్లి 100 రోజుల పాలనలో అమలులోని తెచ్చిన పథకాలపై వివరించారు. చాట్రాయి, పర్వతాపురం, చిన్నంపేటలలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహించారు. టీడీపీ నాయకులు కందుల కృష్ణ, మారేశ్వరరావు, బొర్రా నాగేశ్వరరావు, బోబత్తుల చెన్నారావు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కూటమికి ప్రజా మన్ననలు

కైకలూరు: వంద రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందిందని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కైకలూరు మండలం ఆచవరం, వేమవరప్పాడు గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి గోడలకు స్టిక్కర్లను అతికించారు. ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి రోజుకో ఆర్థిక సంక్షోభం ఏర్పడుతున్నా రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తోందన్నారు. ఆయా గ్రామ సర్పంచ్‌లు కట్టా నాగరాజుగౌడ్, నున్న రాంబాబు, మండల ప్రత్యేక అధికారి నాగలింగాచారి, నియోజకవర్గ కన్వీనర్లు వీరమల్లు నరసింహారావు, విజయలక్ష్మి, తేరా రమేష్, కూటమి నాయకులు పెన్మెత్స త్రినాధరాజు, పోలవరపు లక్ష్మీరాణి, పూల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ఐదేళ్ల వైసీపీ పాలనలో అస్తవ్యస్తంగా మారిన అన్ని వ్యవస్థలను ప్రజోపయోగకర రీతిలో సంస్కరించేందుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన కూటమి నాయకులతో కలసి ముదినేపల్లి మండలం దాకరం, పెదగొన్నూరు గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాల్లో పాల్గొని వంద రోజుల పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. కూటమి ప్రభుత్వం సంస్కరణల ప్రభుత్వమని పేర్కొన్నారు. టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, కో-కన్వీనర్ కొడాలి వినోద్, కూటమి నాయకులు చలసాని జగన్మోహనరావు, కోడూరు శేషుబాబు, కోటప్రోలు కృష్ణారావు, వీరంకి వెంకటేశ్వరరావు, సర్పంచ్ జాస్తి రాజా, తాడంకి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: పెదలంకలో ఆదివారం టీడీపీ నాయకులు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఈ వంద రోజుల్లో ప్రభుత్వం సాధించిన విజయాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు దున్న భోగేశ్వరరావు, అక్కల వెంకటాచలం, దుగ్గిరాల పరమేశ్వరరావు, పోకల సుబ్బయ్య, ముద్దం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


జడ్పీ ఉద్యోగుల బదిలీ ఉత్తర్వులందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

బదిలీల జాతర

జడ్పీలో వివిధ కేడర్లకు సంబంధించి 429 మంది

10 మంది ఎంపీడీవోలు ఇతర జిల్లాలకు..

పంచాయతీ కార్యదర్శుల బదిలీలు కూడా పూర్తి

ఏలూరుసిటీ, సెప్టెంబరు 22: ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్తయింది. దాదాపు 36 రోజుల పాటు కొనసాగిన బదిలీల ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి ఎక్సైజ్ శాఖ మినహాయించి మిగిలిన శాఖలలో బదిలీల ప్రక్రియ పూర్తయింది. కొన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించి ఇప్పటికే బదిలీ ఉత్తర్వులు ఆయా శాఖాధిపతులు అందజేయగా జిల్లా పరిషత్‌కు సంబంధించి ఉద్యోగుల బదిలీ ఉత్తర్వులను జడ్పీ చైర్మన్ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం గత నెల 17వ తేదీన ఉద్యోగుల బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేసినందున ఈ బదిలీల కార్య క్రమం చేపట్టారు.జిల్లా పరిషత్ యాజమాన్యం పరిధిలోని అన్ని కేడర్లలో 429 మంది ఉద్యోగులను బదిలీ చేశారు. ఇక అంతర జిల్లా బదిలీలకు సంబంధించి ఈ జిల్లా నుంచి 10 మంది ఎంపీడీవోలను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. పంచాయతీ శాఖకు సంబంధించి పంచాయతీ కార్యదర్శులు, పంచా యతీ కార్యాలయాల్లో పని చేసే సిబ్బంది బదిలీల ప్రక్రియ కూడా పూర్తయిందని సంబంధిత శాఖాధికారులు చెబుతున్నారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సుబ్బారావు, డిప్యూటీ సీఈవో నిర్మలాజ్యోతి, జిల్లా పరిషత్ పరిపాలనాధికారులు రాఘవులు పాల్గొన్నారు.

జడ్పీ డిప్యూటీ సీఈవో, డీపీవో బదిలీ

జిల్లా పరిషత్ సీఈవో కెఎస్ఎస్ సుబ్బారావును బదిలీ చేస్తూ రిటైన్ ఆర్డరు ఇచ్చారు. అంటే ఆయన ఇక్కడే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ సీఈవోగా కొనసాగేలా ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని కోనసీమ జిల్లాలో డ్వామా డీవీవోగా పనిచేస్తున్న భీమేశ్వర్‌ను ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా డిప్యూటీ సీఈవోగా బదిలీ చేశారు. ఇక్కడ డిప్యూటీ సిఈవోగా పనిచేస్తున్న నిర్మలా జ్యోతిని బదిలీ చేశారు. ఏలూరు జిల్లా డీపీవోగా పనిచేస్తున్న తూతిక శ్రీనివాస్ విశ్వ నాథ్‌ను బదిలీ చేశారు. విజయవాడలో డీఎల్‌డీవోగా పనిచేస్తున్న కె.అనూ రాధను ఏలూరు జిల్లా పంచాయతీ అధికారిగా నియమిస్తూ బదిలీ ఉత్వర్వులు జారీ చేశారు.

ఏలూరు జిల్లా డ్వామా పీడీగా పని చేస్తున్న ఎ.రామును అడిషినల్ పీడీ, ఈజీఎస్ , కృష్ణా/ ఎన్‌టిఆర్ జిల్లా డ్వామా పీడీగా బదిలీ చేశారు. విజయవాడ స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ ఈడీగా పనిచేస్తున్న కేవీ సుబ్బా రావును ఏలూరు డ్వామా పీడీగా నియమితులయ్యారు. ఏలూరు జిల్లాలో సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో ఎం.హిమశైలజను గుంటూరు డీఎఫ్‌వో(టి)గా బదిలీచేశారు. చింతపల్లి టెరిటోరియల్ డీఎఫ్‌వోగా పనిచేస్తున్న సీహెచ్ సూర్యనారాయణను ఏలూరు జిల్లా సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. డీసీఎంఎస్ మేనేజర్‌గా వి.శ్రీలక్ష్మి నియమి తులయ్యారు. ఈమె విజయవాడలో మేనేజర్(స్టోర్స్)గా పనిచేస్తున్నారు. ఏలూరు మునిసిపల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా వి.సురేంద్రబాబు నియమితులయ్యారు.

సిఫార్సులకే ప్రాధాన్యం

సాధారణంగా గతంలో ఎటువంటి సిఫార్సు లేకుండానే బదిలీల ప్రక్రియ నిర్వహించేవారు. కానీ ఈసారి ప్రజాప్రతినిధుల సిఫార్సులకే బదిలీలలో ప్రాధాన్యం కల్పించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు సిఫార్సులు చేసిన వారికే ఈ బదిలీల ప్రక్రియలో ప్రాధాన్యం లభించినట్టు సమాచారం.

భర్త ఎదుటే భార్య, కుమార్తె కిడ్నాప్

ముదినేపల్లి, సెప్టెంబరు 22 : భర్తతో కలసి బస్సులో వేరే రాష్ట్రానికి వెళ్తున్న వివాహితను, ఆమె పదినెలల చిన్నారితో సహా కిడ్నాప్ చేసిన ఘటన శనివారం రాత్రి ముదినేపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ముదినేపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ తన కుమార్తెను కర్నాటక రాష్ట్రంలోని రాయచూర్‌కు చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేసింది. వారికి పది నెలల పాప ఉంది. కొద్ది రోజుల క్రితం రాయచూర్ నుంచి ఆమె తన భర్త, కుమార్తెతో కలసి పుట్టింటికి వచ్చింది. తిరిగి ఈ నెల 21వ తేదీ రాత్రి రాయచూర్ వెళ్లేందుకు ముదినేపల్లిలో బస్ స్టేషన్‌లో బస్సు ఎక్కారు. అయితే గ్రామానికి చెందిన అచ్యుత రమేష్ అనే యువకుడు బస్ స్టేషన్‌కు వచ్చి 'రాత్రి సమయంలో ప్రయాణం చేయవద్దని మీ అమ్మ మిమ్మల్ని ఇంటికి తీసుకురమ్మని తనను పంపింద'ని చెప్పగా, వారు బస్సు నుంచి దిగిపోయారు. బైక్‌పై ఆమె తన చిన్నారితో సహా ఎక్కిన అనంతరం ఆమె భర్త ఎక్కుతుండగా, రమేష్ స్పీడ్‌గా వెళ్లిపోయాడు. విషయాన్ని అల్లుడు తన అత్తకు తెలియజేయగా ఆమె ఆదివారం ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో రమేష్ అనే వ్యక్తి తన కుమార్తెను, మనుమరాలిని కిడ్నాప్ చేశాడని ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి ఎస్ఐ వెంకట్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

పీహెచ్‌సీ వైద్యుల సమ్మెతో గ్రామీణుల వెతలు

ముదినేపల్లి, సెప్టెంబరు 22 : పీహెచ్‌సీ వైద్యుల సమ్మెతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. జీవో 85ను రద్దు చేయాలని ఆరు రోజులుగా పీహెచ్‌సీల వైద్యులు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. మండలంలోని దేవపూడి, గురజ, ముదినేపల్లి పీహెచ్‌సీల్లోని ఆరుగురు వైద్యులు సమ్మెలో పాల్గొన్నారు. దీంతో రోగులకు సరైన వైద్య సేవలు అందటం లేదు. పీహెచ్‌సీల్లో ప్రసూతి సేవలు నిలిచిపోయాయి. నెలలు నిండిన గర్భిణులు ప్రసవాలకు గుడివాడ, కైకలూరు, బంటుమిల్లి, మచిలీపట్నం, గుడ్లవల్లేరులోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామాల్లో జ్వరాలు విస్తృతంగా సోకుతున్న ప్రస్తుత సమయంలో వైద్యులు సమ్మె చేస్తుండటం కూడా ఇబ్బందికరంగా ఉంది. నిత్యం ముదినేపల్లి మండలంలోని పీహెచ్‌సీల్లో 80 నుంచి 100 మంది రోగులు ఓపీకి వస్తుంటారు. సమ్మె కారణంగా వైద్యులు లేకపోవటంతో స్టాఫ్ నర్సులు, హెల్త్ సూపర్‌వైజర్లు రోగులకు వైద్యం అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాధారణ వ్యాధులకు కూడా ప్రజలు ప్రభుత్వ వైద్యుల సమ్మె వల్ల ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తున్నది. వైద్యుల సమ్మె రోగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నది.

వరద బాధితుల కోసం..


మంత్రి లోకేశ్‌కు చెక్కు ఇస్తున్న ట్రిపుల్ ఐటీ యోగశాల విద్యార్థులు

యోగశాల విద్యార్థులు..

నూజివీడు టౌన్, సెప్టెంబరు 22: సామాజిక బాధ్యతలో మేము సైతం అంటూ నూజివీడు ట్రిపుల్ ఐటీ యోగ శాల విద్యార్థులు ముందుకొచ్చారు. విద్యార్థులు రూ.2,82,313లు సేకరించి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా బాధితులకు అండగా నిలవడం గొప్ప విషయమని లోకేశ్ విద్యార్థులను అభినందించారు. యోగ ఇన్‌స్పెక్టర్ ఎ.సత్యశ్రీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కామినేనికి విరాళం అందజేస్తున్న నున్న రమాదేవి

కైకలూరు నియోజకవర్గంలో..

కైకలూరు, సెప్టెంబర్ 22: విజయవాడ వరద బాధితులకు దాతల విరాళాలు అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. కైకలూరు నియోజకవర్గం ఎస్సీ సెల్ తేరా రమేష్ పిలుపు మేరకు నాలుగు మండలాల్లోని ఎస్సీ సెల్ నాయకుల ద్వారా రూ.20 వేలును ఎమ్మెల్యే కామినేనికి అందజేశారు. అలాగే కలిదిండి మాజీ జడ్పీటీసీ సభ్యురాలు నున్న రమాదేవి ద్వారా రూ.31 వేలు ప్రజా విరాళాలను కామినేనికి అందించారు. ఆచవరానికి చెందిన బూరుబోయిన శ్రీనివాసరావు రూ.50 వేలు విరాళాన్ని ఎమ్మెల్యే కామినేనికి అందించారు. వారితో పాటు మరికొంతమంది విరాళాలను అందజేశారు. ఇలా వచ్చిన విరాళాలను సీఎం సహాయనిధికి అందజేయనున్నట్లు కామినేని తెలిపారు. వల్లభనేని శ్రీనివాసచౌదరి, బోయిన రాజు తదితరులు పాల్గొన్నారు.


మంత్రి పార్థసారథికి చెక్కును ఇస్తున్న హెచ్‌ఎం, నాయకులు

విద్యార్థులు ఇంటింటికి వెళ్లి..

చాట్రాయి, సెప్టెంబరు 22: తుమ్మగూడెం ఉర్దూ పాఠశాల హెచ్‌ఎం వెంకట్రావ్, ఎస్ఎంసీ చైర్మన్ షేక్ హసీనా ఆధ్వర్యంలో విద్యార్థులు ఇంటింటికి వెళ్లి సేకరించిన రూ.5 వేల చెక్కును ఆదివారం మంత్రి పార్థసారథికి అందించారు. విద్యార్థులను, అందుకు ప్రోత్సహించిన వారిని మంత్రి అభినందించారు.


కొల్లేటికోట రోడ్డులో కోతకు గురైన ప్రదేశాల్లో గ్రామస్థుల మట్టి తోలకం

రోడ్డు కోసం కలిసికట్టుగా..

» కొల్లేరు లంక వాసులు రూ.28 లక్షల విరాళాల సేకరణ

కైకలూరు, సెప్టెంబరు 22: ఇటీవల కొల్లేరు వరద ఉధృతితో లంక గ్రామాల్లో రోడ్లు ధ్వంసమయ్యాయి. ఈ రోడ్ల మరమ్మతులకు లంక గ్రామాల ప్రజలు ఏకతాటిపైకి వచ్చి విరాళాలను సేకరించారు. కైకలూరు మండలంలోని పెంచికలమర్రు, గుమ్మళ్ళపాడు, శృంగవరప్పాడు గ్రామాల్లో సుమారు 8వేల మంది ఓటర్లు నివశిస్తున్నారు. ఒక్కొక్క ఓటరు 300 చొప్పున రూ.24 లక్షలు విరాళాలను సేకరించారు. మూడు గ్రామాల ప్రజలకు సంబంధించిన రహదారి ఆలపాడు నుంచి కొల్లేటికోటకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు, గోకర్ణపురం నుంచి పైడిచింతపాడు వెళ్లే రహదారిలో అనేకచోట్ల వరద ఉధృతికి గండ్లు పడ్డాయి. మూడు గ్రామాల ప్రజలు కలిసిగట్టుగా మరమ్మతులు నిర్వహించుకునేందుకు ఆలోచన చేశారు. వీరి ఆలోచనను రాష్ట్ర వడ్డీసాధికారిక సమితి కన్వీనర్ బలే ఏసురాజు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వీరిద్దరూ చెరో రూ.2లక్షలు చొప్పున అందించారు. మరో ఇద్దరు వ్యక్తులు రూ.15 వేలును విరాళం ఇచ్చారు. మొత్తం రూ.28లక్షల 15వేలతో రోడ్లు మరమ్మతులు చేపట్టనున్నారు. భీమవరానికి చెందిన ఓ కాంట్రాక్టర్‌కు ఈ సొమ్మును అందించి త్వరలో పనులు ప్రారంభించనున్నట్టు ఏసురాజు తెలిపారు. కాగా ఆదివారం గోతుల్లో కొంత మట్టిని తోలి తాత్కాలికంగా రాకపోకలకు వీలుగా చర్యలు తీసుకున్నారు.

ముంపు నివారణకు కార్యాచరణ ప్రణాళిక

ముదినేపల్లి, సెప్టెంబరు 22 : కైకలూరు నియోజక వర్గంలో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగు పరచి పొలాల ముంపు నివారణకు కార్యాచరణ రూపొందించే ప్రక్రియను చేపడతానని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. భారీ వర్షాలతో పెదలంక మేజర్ డ్రెయిన్ పరిధిలో ముంపునకు గురై నేటికీ తేరుకోని వరి పొలాలను ఆదివారం కూటమి నాయకులతో కలసి ఆయన పరిశీలించారు. పెదగొన్నూరు, విశ్వనాద్రిపాలెం తదితర గ్రామాల్లో ముంపులోనే ఉన్న పొలాల్లో కుళ్లిన వరి పైరును చూశారు. ఈ సందర్భంగా పెదగొన్నూరులో రైతులు పెదలంక మేజర్ డ్రైన్‌లో కిక్కిస, గుర్రపు డెక్క, తూటు కాడ పెద్ద ఎత్తున పేరుకుపోవటం వల్ల పొలాల్లో ముంపు ఏర్పడి పంటకు తీవ్ర నష్టం కలిగిందని ఎమ్మెల్యేకి తెలపగా పెదలంక డ్రైన్ సమస్యను సినీ నిర్మాత డాక్టర్ కె.ఎల్.నారాయణ తన దృష్టికి తెచ్చారని, నియోజకవర్గంలోని అన్ని డ్రెయిన్లను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నామని, డ్రెయిన్ల సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానన్నారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వ పరిహారం అందుతుందని తెలిపారు. నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, కూటమి పాల్గొన్నారు. దాకరంలో మాజీ ఎంపీపీ, టీడీపీ నాయకుడు స్వర్గీయ దుక్కిపాటి సింహాద్రి అప్పారావు సతీమణి సరళాదేవి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆమె కుటుంబీకులను పరామర్శించారు.

కైకలూరు: కైకలూరు మండలం ఆచవరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సీమంతం కార్యక్రమానికి కామినేని హాజరై గర్భిణులకు చీరెలు బహూకరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి పాల్గొన్నారు.


గుడిపాడు సబ్‌స్టేషన్‌లో చేరిన వాన నీరు(ఫైల్)


నీట మునిగిన వ్యవసాయ భూములు, బోరు (ఫైల్)

అధికారుల నిర్లక్ష్యం.. అన్నదాతకు శాపం

» వంతెన నిర్మాణానికి బదులుగా చిన్న తూరలు వేసిన అధికారులు

» వర్షం వస్తే ముంపులోనే వ్యవసాయ భూములు

» జల దిగ్బంధంలోనే నివాసాలు

» సబ్ స్టేషన్ మునుగుతున్నా పట్టించుకోని అధికారులు

ముసునూరు, సెప్టెంబరు 22: ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారింది. గుడిపాడు నల్లచెరువులోకి వరదనీరు వెళ్లేందుకు రహదారిపై వంతెన నిర్మించాల్సి ఉండగా, 20 ఏళ్ల క్రితం చిన్న సిమెంట్ తూరలను వేసి ఇరిగేషన్ అధికారులు చేతులు దులుపుకున్నారని, దీంతో వరద నీరు పొంగి పొర్లి సబ్ స్టేషన్‌ను చుట్టుముట్టి, పక్కన నివాస గృహాలు, పంట భూములు, వ్యవసాయ బోర్లు సైతం నీట మునుగుతున్నాయని బాధిత రైతులు వాపోతున్నారు. దశాబ్ద కాలంగా ఈ సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేసినా నేటికీ పట్టించుకున్న నాథుడే లేడని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సబ్ స్టేషన్ ముంపునకు గురవుతున్నా ట్రాన్స్‌కో అధికారులు సైతం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. శనివారం కురిసిన భారీ వర్షానికి గుడిపాడు సబ్‌స్టేషన్ జల దిగ్బంధంలో చిక్కుకుంది. వర్షం కురిసినప్పుడల్లా ఇదే పరిస్థితి నెలకొంటుందని, ఇప్పటికైనా నల్లచెరువులోకి వచ్చే వరదనీరు పూర్తిస్థాయిలో వెళ్ళేలా రహదారి కింద తాత్కాలికంగా పెద్దసైజు సిమెంట్ తూరలు వేసేలా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు, స్థానికులు, విద్యుత్ సిబ్బంది కోరుతున్నారు.


ట్రిపుల్ ఐటీలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న దృశ్యం

ట్రిపుల్ ఐటీలో స్వచ్ఛతా హీ సేవ

నూజివీడు టౌన్, సెప్టెంబరు 22: నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లోని ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 5, 7 వలంటీర్లు క్యాంపస్‌లోని లైబ్రరీ, క్వార్టర్స్ పరిధిలో పిచ్చి మొక్కలను తొలగించారు. వీరిని డైరెక్టర్ అమరేంద్ర కుమార్, ఏవో డాక్టర్ లక్ష్మణ్‌లు అభినందించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రావణి, కనక కుమారి, సీతాపతిరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రాంతాల్లో వైద్య శిబిరం



నూజివీడు టౌన్, సెప్టెంబ రు 22: నూజివీడు పెద్ద చెరువు వరద ప్రభావిత ప్రాంతాల్లో డాక్టర్ జయకిషన్ చింతల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి జేకే ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా మందులను అందించారు. శ్వాస కోశ వ్యాధులు, పోషకాహార లోపంపై అవగాహన కల్పించారు.

గౌతు లచ్చన్న విగ్రహం ఏర్పాటుకు వినతి

నూజివీడు టౌన్, సెప్టెంబరు 22: నూజివీడులో ప్రముఖ సమరయోధుడు, గౌడ సంఘ నాయకుడు గౌతు లచ్చన్న విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ నూజివీడు గౌడ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధికి ఆదివారం వినతి పత్రం అందించారు. గౌడ సంఘ నాయకులు పామర్తి నాగేంద్రరావు, ఆరేపల్లి శ్రీనివాస్, జనసేన ఉమ్మడి కృష్ణా జిల్లా అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ, మాజీ కౌన్సిలర్ చలమాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : సీఐ

నూజివీడు టౌన్, సెప్టెంబరు 22: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ అన్నారు. నూజివీడు మండలం వెంకటాద్రిపురంలో గల నూజివీడు పాలిటెక్నిక్ కళాశాలలో 'ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం- సైబర్ నేరాలు'పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బ్యాంక్, అమేజాన్, ఫ్లిప్‌కార్ట్ తదితర సంస్థల ప్రతినిధులమంటూ పంపుతున్న లింక్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. రూరల్ ఎస్సై లక్ష్మణ్‌బాబు, కళాశాల చైర్మన్ రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు పాలాభిషేకం



నూజివీడు, సెప్టెంబరు 22: మాలయోధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాజ్యాం గ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం పాలాభిషేకం చేశారు. సంఘం కోర్ కమిటీ సభ్యులు చేబ త్తిన కోటేశ్వరరావు మాట్లాడు తూ అంబే డ్కర్‌పై అమర్యాదగా వ్యవహరించిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు చర్యలను ఖండిస్తున్నామన్నారు. తక్షణం ఆయన క్షమాపణ చెప్పాలని డిమాం డ్ చేశారు. నూజివీడు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆయనపై ఫిర్యాదు చేశారు. నత్తా నాగేశ్వరరావు, పిల్లా చరణ్, బొర్రే సుధాకర్, తులిమెల్లి ఇస్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి శాంతి కళ్యాణం

ముదినేపల్లి, సెప్టెంబరు 22: ముదినేపల్లి మండలం సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లో వేంచేసి ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి శాంతి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు తోలేటి వీరభద్ర శర్మ, కోట శివశంకర్ శర్మ ఆధ్వర్యంలో పలువురు దంపతులు స్వామి జన్మనక్షత్రమైన కృత్తిక నక్షత్రంలో కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయంలో అభిషేకాలు జరిపారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ సంధ్య పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

చిరంజీవికి గిన్నిస్ బుక్ పురస్కారంపై హర్షం

ముదినేపల్లి, సెప్టెంబరు 22 : సినీ హీరో చిరంజీవికి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కటం పట్ల చిరంజీవి యువత ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు వర్రె హనుమాన్ ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. సినీ రంగంలోనే కాక, సామాజిక సేవా కార్యక్రమాల్లోను ఉన్నత శిఖరాలను అందుకుని చిరంజీవి గిన్నిస్ బుక్ పురస్కారం అందుకోవటం అభినందనీయమని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

నూజివీడు టౌన్, సెప్టెంబరు 22: కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నూజివీడులో వైసీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు ఆదివారం పర్యటించారు. పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ అభ్యర్థి గౌతంరెడ్డితో కలసి కార్యకర్తలతో మాట్లాడుతూ ఎమ్మెల్సీగా గౌతం రెడ్డిని గెలిపించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు పాల్గొన్నారు.